PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 45 సంచిక : 41 | విజయవాడ, గురువారం 11 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Thursday 11 September 2025 | Rs



కుల్దీప్, దూబే మాయ
- యుఎఇపై తొమ్మిది వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం
- ఆసియాకప్ క్రికెట్ టోర్నీ 8

భూచట్టాల రక్షణ కోసం పోరాటం



- అదే ఐలమ్మకు నిజమైన నివాళి
- తెలంగాణ సాయుధపోరాటాన్ని వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు
- వర్ధంతి సభలో బివి రాఘవులు 2

వచ్చే నెల 15న 'వాహనమిత్ర'

- ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అందజేస్తాం
- రాష్ట్ర పునర్ నిర్మాణమే లక్ష్యం
- వైకుంఠపాళి లేకుండా కలసి పనిచేస్తాం
- 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

వచ్చే నెల 15వ తేదీన వాహనమిత్ర పథకాన్ని ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఈ పథకం కింద ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అందజేస్తామన్నారు. రాష్ట్ర పునర్ నిర్మాణం లక్ష్యంగా కూటమిలోని మూడు పార్టీలూ పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. 'సూపర్ సిక్స్-సూపర్ హిట్' పేరుతో మూడు పార్టీలూ కలసి అనంతపురం నగరంలో భారీ బహిరంగ సభను బుధవారం నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, టిడిపి, జనసేన, బిజెపి ఎమ్మెల్యేలు, ఎంపిలు, రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరయ్యారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశామని చెబుతూ రాయలసీమ ప్రాంతీయ సభలా దీన్ని నిర్వహించారు. నాలుగు జిల్లాల నుంచి పెద్ద ఎత్తున జనసమీకరణ చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ సూపర్ సిక్స్ అమలు చేయలేరంటూ వైసిపి నాయకులు హేళన చేశారన్నారు. 'పింఛన్ల పెంపు అంటే అసాధ్యమన్నారు. పిల్లలందరికీ తల్లికి వందనం అంటే ట్రోల్ చేశారు. దీపం వెలగదన్నారు. ఫ్రీ బస్సు కదలదని ఎగతాళి చేశారు. ఇప్పుడు వాటన్నింటినీ కూటమి ప్రభుత్వం అమలు చేసి చూపించింది' అని అన్నారు. మెడికల్ కాలేజీలంటే తెలియని నాయకుడు ఏదేదో మాట్లాడుతున్నాడని వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని ఉద్దేశించి విమర్శించారు. రాష్ట్రంలో 17 కాలేజీలు ఉంటే ఒక్కటి మాత్రమే పూర్తయిందన్నారు. శంకుస్థాపన చేసి రిబ్బన్ కట్ చేసి ఏదో చేశానని చెప్పుకుంటున్నారని జగన్‌పై నిప్పులు చెరిగారు. అసెంబ్లీకి వస్తే మెడికల్ కాలేజీలపై చర్చిద్దామన్నారు. వైసిపి నాయకుడిది ధృతరాష్ట్రుడి కౌగిలి అని విమర్శించారు. ఆ కౌగిలిలో చిక్కుకుని



బహిరంగ సభావేదికపై సూపర్ సిక్స్-సూపర్ హిట్ జెండాలను ఊపుతున్న చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్, మాధవ్

అంతకు మునుపు ఐదేళ్ల ప్రజలు నలిగిపోయారన్నారు. 2024లో దానినుంచి విముక్తి లభించిందని పేర్కొన్నారు.

రాయలసీమ అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులను పూర్తి చేయడమే కాకుండా ఈ ప్రాంతానికి డిఫెన్సు, స్పేస్, సెమీ కండక్టర్, ఆటోమొబైల్, సోలార్, విండ్ ఇలా అనేక రకాల పరిశ్రమలు రానున్నాయని తెలిపారు. 2024 ఎన్నికల్లో రాయలసీమలో 52 అసెంబ్లీ స్థానాల్లో 45 చోట్ల కూటమి గెలిచిందన్నారు. వచ్చే ఎన్నికల్లో 52 స్థానాల్లోనూ విజయం సాధిస్తామని పేర్కొన్నారు. మూడు పార్టీలూ కలిసి రాష్ట్ర పునర్ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. ఈ బంధంగా సుదీర్ఘకాలం కొనసాగుతుందని, వైకుంఠపాళి ఉండబోదని పేర్కొన్నారు. ఈ అధికారం ప్రజలకు సేవ చేయడానికే అని కార్యకర్తలు గుర్తు పెట్టుకోవాలని, ఏ ఒక్క తప్పు చేసినా ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని అన్నారు. సిఎం అంటే చీఫ్ మినిస్టర్‌గా భావించడం లేదని, కామన్‌మాన్‌గా భావించి పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజల శ్రేయస్సు కోసమే కలిసి పనిచేస్తున్నాం

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట్లాడుతూ పార్టీలు వేరైనా ప్రజల శ్రేయస్సు కోసం కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలతో గత ఎన్నికల్లో ఘన విజయం సాధించామన్నారు. ఇప్పుడు వీటిని అమలు చేశామని పేర్కొన్నారు. రాష్ట్రంలో నాలుగు వేల కిలోమీటర్లు సిసి రోడ్ల నిర్మాణం పూర్తి చేశామన్నారు. 1005 పిఎం జన్‌ధన్ పథకం ద్వారా 625 గిరిజన గ్రామాలను అనుసంధానం చేసే విధంగా రోడ్ల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కడా డోలీ మోతలు లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అత్యంత వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లేవారని, ఇకనుంచి స్థానికంగానే ఉపాధి అకాశాలు కల్పించే పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రయత్నాలు సాగుతున్నాయని తెలిపారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ మాట్లాడుతూ అమరావతి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేల కోట్ల తోడ్పాటు అందించిందన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

నేపాల్ తాత్కాలిక ప్రధానిగా
సుశీలా కర్కి !

- మాజీ చీఫ్ జస్టిస్‌ను ప్రతిపాదించిన జెన్ జడ్
- సైనిక పహరాలో ఖాట్మండు
- నెమ్మదిగా సాధారణ పరిస్థితులు

ప్రజాశక్తి - యంత్రాంగం

నిరసనలు, ఆందోళనలు, హింసతో అట్టుడికిన నేపాల్‌లో నెమ్మదిగా సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. రెండు రోజులుగా ఉద్యమించిన అక్కడి యువత (జెనరేషన్ జెడ్ -జెన్ జెడ్) తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాట్లపై దృష్టి సారించారు. బుధవారం నిర్వహించిన ఒక ఆన్‌లైన్ సమావేశంలో నేపాల్ సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ సుశీలా కర్కి(73)ని తాత్కాలిక ప్రధానిగా నియమించాలని జెన్-జెడ్ ఉద్యమం ప్రతిపాదించింది. దీనికి ఆమె కూడా సానుకూలంగా స్పందించారు. దీంతో అనూహ్య పరిణామాలు చోటుచేసుకుంటే తప్ప మిగిలిన ప్రక్రియ లాంఛనమే అని భావిస్తున్నారు. ఒక మీడియా సంస్థతో మాట్లాడిన ఆమె కీలక బాధ్యతలు స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలను ఆదుకోవడం తన తొలి ప్రాధాన్యతగా ఆమె చెప్పారు. సోషల్ మీడియాపై నిషేధంతో జెన్ జెడ్ నేతృత్వంలో ప్రారంభమైన ఉద్యమం ఆ తరువాత అవినీతి వ్యతిరేకపోరాటంగా మారిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పెద్ద ఎత్తున హింసాత్మక సంఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో ప్రధాని కెపి శర్మ సహా పలువురు మంత్రులు తమ పదవులకు రాజీనామాలు చేశారు. ఈ



జస్టిస్ సుశీలా కర్కి

నేపథ్యంలో కొత్త సారథిని ఎన్నుకోవడంపై జెన్-జెడ్ ఉద్యమకారులు దృష్టి సారించారు. బుధవారం నిర్వహించిన వర్చ్యువల్ సమావేశంలో దాదాపుగా ఐదువేల మంది పాల్గొని ఉంటారని అంచనా. ఈ సమావేశంలో తాత్కాలిక ప్రధానిగా తొలుత ఖాట్మాండ్ మేయర్ బాలెన్ షా పేరు ప్రస్తావనకు వచ్చినట్లు స్థానిక మీడియాలో కథనాలు వచ్చాయి. అయితే, ఆ బాధ్యతలు తీసుకోవడానికి ఆయన ఆసక్తి చూపలేదు. దీంతో సుశీలా కర్కే పేరు తెరమీదకు వచ్చింది. జెన్ జెడ్ నేతలు నేపాల్ ఆర్మీ చీఫ్ జనరల్ అశోక్ రాజ్ సిగ్ధల్, మిగతా 7లో

తక్షణమే ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగాలి
- నేపాల్ సంక్షోభంపై సిపిఎం విచారం 7

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా ?

- మాజీ సిఎం జగన్ ప్రశ్న
- ప్రభుత్వం పాలన పేరుతో దోపిడీ చేస్తోంది

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రభుత్వం పాలన పేరుతో దోపిడీకి పాల్పడుతోందని, అసలు ప్రభుత్వం ఉందా లేదా అనే అనుమానం వ్యక్తమవుతోందని మాజీ సిఎం జగన్ అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు ప్రైవేటు వ్యక్తుల దోపిడీకి గురవుతున్నాయన్నారు. దీనికి పాలకులు సహకరిస్తున్నారని చెప్పారు. యూరియాను టిడిపి నాయకులే బ్లాక్ మార్కెట్‌కు తరలించి రూ.250 కోట్ల స్కామ్‌కు పాల్పడ్డారన్నారు. రైతులు క్యూలో నించుంటే పట్టించుకున్న నాథుడు లేడని, అసలు ప్రభుత్వం పాలన చేస్తుందా లేదా అనే అనుమానాలు కలుగుతున్నాయని చెప్పారు. రైతుల పక్షాన అధికారులను కలిసి అర్జీ ఇస్తామని తెలిపినా అనుమతిలేదంటూ పోలీసులు నోటీసులు ఇస్తున్నారన్నారు. రెండు నెలలుగా రైతులు అగచాట్లు పడుతుంటే ప్రభుత్వం స్పందన లేకుండా వ్యవహరిస్తోందన్నారు. టమోటా, ఉల్లి, బత్తాయి పంటలకు కూడా ధర లేదని చెప్పారు. వైసిపి పాలనలో ఎన్నడూ యూరియా కొరత రాలేదని



చెప్పారు. ఈనెల3న ముఖ్యమంత్రి 6.65 టన్నుల యూరియాను సరఫరా చేసినట్లు చెప్పారని, అయినా రైతులు రోడెక్కే పరిస్థితి ఎందుకు వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. వైసిపి హయాంలో ప్రతి జిల్లాకు ఒక టీచింగ్ హాస్పటల్ తీసుకురావాలనే ఉద్దేశంతో మెడికల్ కళాశాలలు నిర్మిస్తే వాటిని ప్రైవేటుపరం చేశారని అన్నారు. పులివెందుల కళాశాలలో 58 మెడికల్ సీట్లకు అనుమతి వచ్చినా వద్దని లేఖ రాశారని తెలిపారు. ఆరోగ్యశ్రీలో ప్రొసీజర్లను తగ్గించారని, నెలకు రూ.300 కోట్లు కట్టలేనివారు ఇన్సూరెన్స్ పేరుతో ఏడాదికి రూ.5000 కోట్ల నుండి రూ.6000 కోట్లు చెల్లిస్తారా అని ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తురకపాలెంలో రెండు నెలల కాలంలో అంతుచిక్కని వ్యాధితో 40 మంది చనిపోయినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. ఆడబిడ్డ నిధి రూ.36 వేలు ఇవ్వలేదని, ఎస్‌సి, ఎస్‌టి, బిసిల్లో 50 ఏళ్ల నిండినవారికి మిగతా 7లో



పొరుగు దేశాల్లో పరిస్థితి చూడండి

- రాజ్యాంగం మనకు గర్వకారణం
- రాష్ట్రపతి పంపిన ప్రస్తావనపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు
- ఎన్ని బిల్లులను నిలిపివేశారని కాదు, నిలిపివేసే అధికారంపైనే ప్రశ్న
- నేడూ కొనసాగనున్న విచారణ 7

గ్రామీణ ప్రజలతో సమైక్య ఉద్యమాలు

- మత విద్వేషాలకు వ్యతిరేకంగా ప్రచారోద్యమం
- 16న ఢిల్లీలో భారీ కన్వెన్షన్
- రాజ్యసభ సభ్యులు వి శివదాసన్
- విద్యుత్ ప్రైవేటీకరణలో భాగంగానే స్మార్ట్‌మీటర్లు : బి.వెంకట్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శివదాసన్

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

దేశంలోని వ్యవసాయ కార్మికులను, గ్రామీణ పేదలను, సన్న, చిన్నకారు రైతులను సమీకరించి సమైక్య ఉద్యమాలు నిర్వహిస్తామని రాజ్యసభ సభ్యులు డాక్టర్ వి.శివదాసన్ తెలిపారు. వచ్చే అక్టోబర్, నవంబర్, డిసెంబర్ మాసాల్లో కేంద్రప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. అక్టోబర్‌లో 30 వేల గ్రామాల్లో ప్రచారం చేస్తామని చెప్పారు. కేంద్రంలో బిజెపి అమల్జేస్తున్న హిందూత్వ అజెండాకు వ్యతిరేకంగా, మత విద్వేషాలకు వ్యతిరేకంగా 'సేవ్ సెక్యులరిజం' పేరుతో నవంబర్‌లో 15 రోజుల పాటు ప్రచారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ క్రమంలో ఢిల్లీలో ఈ నెల 16న భారీ కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కడపలోని హరితా హోటల్‌లో మూడ్రోజులపాటు నిర్వహించిన అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ సమావేశాల ముగింపు సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.విజయరాఘవన్, బి.వెంకట్‌తో కలిసి బుధవారం శివదాసన్ విలేకర్ల సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి, ప్రధానమంత్రి ఆవాజ్ యోజనకు, మధ్యాహ్న భోజన పథకానికి కేటాయింపులను క్రమేణా తగ్గిస్తూ వస్తోందన్నారు. రాబోయే మూడేళ్లలో ప్రపంచ దేశాల్లో భారతదేశం మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని చెబుతున్నారని, ఇందులో కార్పొరేట్లు, ధనికులకే అత్యధిక లబ్ధి చేకూరుతుందని, గ్రామీణ పేదలకు ఎటువంటి లబ్ధీ ఉండదని తెలిపారు. దేశంలో పేదరికాన్ని ప్రధాని మోడీ పెంచుతున్నారే తప్ప, తగ్గించే ప్రయత్నం చేయడం లేదన్నారు. ఫలితంగా సామాజిక అంతరాలు పెరుగుతున్నాయని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దళితులకు, గిరిజనులకు, మైనార్టీలకు, పేదలకు వ్యతిరేకమని చెప్పారు. సమాఖ్యతత్వానికి, గవర్నింగ్ చట్టాలకు తూట్లుపొడుస్తోందన్నారు. రాష్ట్రాల అధికారాలను కుదించడం ద్వారా వాటిని మున్సిపాల్టీల స్థాయికి దిగజార్చుతోందని తెలిపారు. తెలుగు జాతి ఆత్మగౌరవానికి విఘాతం ఏర్పడిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడబలుక్కుని రియల్టర్లకు భూసంతర్పణ చేస్తున్నాయని మిగతా 7లో

యూరియా లక్ష టన్నుల కోత

- దేశ వాప్తంగా పది శాతం తగ్గుదల లక్ష్యం
- ఎపికి 25 శాతం విధించిన కేంద్రం
- ఏప్రిల్- ఆగస్టు వాస్తవ చిత్రం
- కాకి లెక్కలతో రాష్ట్ర సర్కార్ కాలక్షేపం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

కేంద్రం నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి గతేడాది ఖరీఫ్‌లో ఏప్రిల్ నుంచి ఆగస్టు చివరాఖరు వరకు వచ్చిన యూరియా పరిమాణానికి, ఈ సంవత్సరం ఈపాటికి వచ్చిన యూరియా పరిమాణానికి మధ్య సుమారు లక్ష టన్నుల కోత నమోదైంది. ఎపికి యూరియా కేటాయింపుల్లో మోడీ ప్రభుత్వం 25 శాతం మేర కోత విధించింది. ఈ కఠోర వాస్తవాన్ని రాష్ట్ర టిడిపి కూటమి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా



దాచి పెట్టినట్లు తెలుస్తోంది. కేంద్రం వద్ద తమ పరపతిని ఉపయోగించి ఎక్కువగానే యూరియాను రప్పించామని, అవసరానికి మించి అందుబాటులో ఉందని, కొంత మంది ఎరువును పక్కదారి పట్టిస్తున్నారని కూటమి సర్కార్ ఎత్తుకున్న ప్రచారంలో నిజం లేదని కంపెనీల వారీగా నిరుడు, ఈఏడు ఎంతెంత ఎరువు వచ్చిందన్న వాస్తవాలు వెలుగు చూడటం ద్వారా అర్థమవుతోంది. కాగా దేశ వ్యాప్తంగా ఈ సంవత్సరం మొత్తమ్మీద పది శాతం యూరియా వాడకాన్ని రైతులతో తగ్గింపజేసి ఆ మేరకు సబ్సిడీ భారాన్ని కేంద్ర బిజెపి ప్రభుత్వం తగ్గించుకోవాలనుకోగా, ఆ లక్ష్యం కంటే అధికంగా మన రాష్ట్రానికి యూరియా కోత పెట్టింది. అన్నదాతలకు చేసిన అన్యాయాన్ని, నష్టాన్ని, యూరియా కోసం పడుతున్న వారి అగచాట్లను తమ 'డబుల్ ఇంజన్ సర్కార్' ఘనతగా చెప్పుకోవడం గమనార్హం.

35 శాతం పైనే...

2024- ఖరీఫ్‌లో 6,32,138 టన్నుల యూరియా అమ్మకాలు జరగ్గా 2025- ఖరీఫ్ సీజన్‌కు కేంద్రం 6,22,000 టన్నులకు కేటాయింపులను తగ్గించింది. కాగా కేటాయించిన మేరకు యూరియాను నెలవారీ అవసరాలకనుగుణంగా ముందస్తుగా చేసిన ప్లాన్‌కనుగుణంగా సరఫరా చేయకుండా కోతలు పెట్టింది. నిరుడు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 4,69,297 టన్నులను కంపెనీల వారీగా కేటాయింపులు చేసి రాష్ట్రానికి సరఫరా చేసింది. ఈ సంవత్సరం ఇదే సమయంలో కేంద్రం నుంచి రాష్ట్రానికి చేరిన యూరియా 3,72,246 టన్నులు మాత్రమే. నిరుడు కంటే ఈ సంవత్సరం 97,057 టన్నులు తగ్గింది. సీజన్ ముమ్మరమై డిమాండ్ అధికంగా ఉన్న వేళల్లో కేంద్రం నుంచి సరఫరాకు భారీగా కత్తెర పడటం, మిగతా 7లో

ఖరీఫ్‌లో యూరియా కోత ఇలా (టన్నుల్లో)

నెల	2024	2025	వ్యత్యాసం
ఏప్రిల్	57,365	75,497	+18,132
మే	63,287	51,655	- 11,692
జూన్	96,423	68,281	- 28,142
జులై	1,31,259	90,922	- 40,337
ఆగస్టు	1,20,922	85,892	- 35,030
మొత్తం	**4,69,297**	**3,72,246**	**- 97,051**

సచివాలయాలకే బంగారు కుటుంబాలు

మార్గదర్శకాలు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పి-4 కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన బంగారు కుటుంబాల బాధ్యతను గ్రామ వార్డు సచివాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. దీనికి సంబంధించి బుధవారం మార్గదర్శకాలను కారీచేశారు. ఈ మేరకు ప్రణాళిక శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో బంగారు కుటుంబాలను క్లస్టర్లుగా విభజించి ఒక్కో కార్యదర్శికి మూడు క్లస్టర్లు చొప్పున కేటాయించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. తమ క్లస్టర్ల పరిధిలో ఉన్న కుటుంబాలకు అందే సాయం బాధ్యతను ఆ కార్యదర్శులే తీసుకోవాల్సి ఉంటుంది. కార్యదర్శులు నిర్వహించే రోజువారీ విధుల్లోనే ఈ బాధ్యత కూడా ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. కార్యదర్శులకు కేటాయించిన కుటుంబాలను కనీసం వారానికి ఒకసారి పర్యవేక్షించాలని నిర్దేశించారు. వారికి సాయం చేసేందుకు ముందుకొచ్చే మార్గదర్శులతో కూడా సమన్వయం చేసుకోవాలని తెలిపారు. మార్గదర్శులకు, బంగారు కుటుంబాలకు మధ్య ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే వాటినీ కార్యదర్శులు పరిశీలించాలని సూచించారు. జిల్లా ప్రణాళికశాఖ అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో వివిధ రంగాల్లో బంగారు కుటుంబాలకు అందే సాయం వివరాలు, వాటిపై ఎలా పర్యవేక్షణ చేయాలన్నదానిపైనా కార్యదర్శులకు సూచనలు చేశారు.

రాష్ట్ర గవర్నరుతో తెలంగాణ గవర్నరు భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నరు జస్టిస్ అబ్దుల్ నజీర్‌తో తెలంగాణ గవర్నరు జిష్ణుదేవ్ వర్మ రాజ్‌భవన్‌లో బుధవారం భేటీ అయ్యారు. ఇద్దరు గవర్నర్ల భేటీ కేవలం మర్యాదపూర్వకమేనని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నరును శాలువాతో సత్కరించారు.

రహదారుల అభివృద్ధికి రూ.500 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.500 కోట్లను మంజూరు చేసింది. ఈ మేరకు రోడ్లు, భవనాలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్లు, భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ (సిఇ) ప్రతిపాదన లు పరిశీలించిన ప్రభుత్వం రూ.500 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులిచ్చింది. ఈ మొత్తంలో రూ.200 కోట్లు రాష్ట్ర రహదారుల అభివృద్ధి పనులకు, మరో రూ.300 కోట్లు జిల్లా రహదారుల అభివృద్ధి పనులకు కేటాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది.

మద్యం కేసులో దిలీప్‌కు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

మద్యం కేసులో నిందితుడు పైలా దిలీప్‌కు బుధవారం హైకోర్టు నోటీసులిచ్చింది. దిలీప్‌కు కింది కోర్టు బెయిల్ మంజూరు చేయడాన్ని సవాల్ చేస్తూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప బుధవారం విచారించారు. గత నెల 28న విజయవాడ ఎసిబి ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును సిట్ సవాల్ చేసింది. బెయిల్‌ను రద్దు చేయాలని కోరింది. ఈ మేరకు విచారణను హైకోర్టు ఈ నెల 15కు వాయిదా వేసింది.

మార్క్‌ఫెడ్‌కు రుణాలు పొందేందుకు అనుమతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తక్కువ వడ్డీకి రుణాలు అందించే ప్రభుత్వ బ్యాంకుల నుంచి రుణం పొందేందుకు మార్క్‌ఫెడ్‌కు అధికారాన్ని ఇస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గతేడాది డిసెంబరులో జారీ చేసిన ఉత్తర్వులను సవరిస్తూ వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ బుధవారం తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చే బ్యాంకుల వద్ద రుణాలు పొందడంతో సంస్థపై ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలన్నారు. ప్రభుత్వం బడ్జెట్ నుంచి మద్దతు లేకుండా, రుణాలను పూర్తిగా ఎపి మార్క్‌ఫెడ్ భరించాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. తుది ఒప్పందానికి ముందు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు.

ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులరైజ్ చేయాలి

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జెఎల్ఎం (గ్రేడ్-2 (ఎనర్జీ అసిస్టెంట్ల)ను విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (యుఇఇయు) కోరింది. యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం విజయవాడలోని సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి పి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎనర్జీ అసిస్టెంట్లకు ఎస్ఇబి సర్వీస్ రెగ్యులేషన్స్ వర్తింపజేసి అసిస్టెంట్ లైన్‌మెన్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని కోరారు. కోర్టు కేసుల పేరుతో పెండింగ్‌లో ఉన్న జెఎల్ఎంలకు న్యాయం చేసి ఉద్యోగోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇపిడిసిఎల్‌లో రెగ్యులర్ లైన్‌మెన్లను, పనిచేసే సబ్‌స్టేషన్‌లను కాంట్రాక్టు పద్ధతిలో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించొద్దని కోరారు. రెగ్యులర్ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న 4 డిఎలను వెంటనే విడుదల చేయాలని, కాంట్రాక్టు వర్కర్లకు 2022 పిఆర్‌సి ఎరియర్స్ చెల్లించాలని, వేతనాల్లో వ్యత్యాసాన్ని సవరించాలని కోరారు. కార్మికుల సమస్యలపై గతంలో అనేకసార్లు యాజమాన్యానికి వినతిపత్రాలు అందించామని, వీటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేదంటే పరిష్కారం కోసం దశలవారీ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని, కలిసొచ్చే సంఘాలతో భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర నాయకులు ఎల్ రాజు, పెంచల ప్రసాద్, జాకీర్ హుస్సేన్, హజరతయ్య, సత్యారావు, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, నాయబ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ పేదల జీవనోపాధికి రూ.260 కోట్లు మంజూరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ పేదల జీవనోపాధి కోసం చేపట్టే కార్యక్రమాలకు రూ.260.20 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఎక్స్ అఫిషియో డైరెక్టర్ వాకాటి కరుణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (డిఎవై-ఎన్ఎల్ఆర్ఎం) పథకంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి మొదటి విడతగా ఈ మొత్తం అందించేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతి ఇచ్చిందన్నారు. కేటాయించిన మొత్తాన్ని ఖర్చు చేయడానికి నియమ నిబంధనలు పాటించాలని, డ్రాయింగ్ అధికారి రసీదు (డిఒఆర్) అందే వరకూ తదుపరి బడ్జెట్ విడుదల కాదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భూచట్టాల రక్షణ కోసం పోరాటం

అదే ఐలమ్మకు నిజమైన నివాళి తెలంగాణ సాయుధపోరాటాన్ని వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు వర్ధంతి సభలో బివి రాఘవులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తెలంగాణ సాయుధ పోరాటంలో భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం మరువలేనిదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు బివి రాఘవులు అన్నారు. విజయవాడ బందరు రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో బుధవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆమె వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా బివి రాఘవులుతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం రాఘవులు మాట్లాడుతూ కమ్యూనిస్టుల పోరాటాల ఫలితంగా భూచట్టాలు వచ్చాయని, నేటి పాలకులు ఆయా భూచట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా మారుస్తున్న విధానాలపై పోరాటాలు సాగించి భూ చట్టాలను రక్షించడమే ఐలమ్మకు నిజమైన నివాళి అని ఆయన అన్నారు. ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ఆమె ఆలోచనలను ఆచరణలో పెట్టి సమానత్వ, సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం నేటికీ దేశ ప్రజలకు ఎంతో ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. భాషా ప్రయుక్తరాష్ట్రాల ఏర్పాటు ఆ పోరాట ఫలితమే నన్నారు. పాలకవర్గాలు చరిత్రను వక్రీకరించేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపి,సంఘ్‌పరివార్ శక్తులు దానిని మత పోరాటంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేస్తున్నాయన్నారు. నైజాం సర్కారుకు ఆర్ఎస్ఎస్‌కు చాలా పోలికలు ఉన్నాయని చెప్పారు.

బ్రిటీష్ ఏజెంట్లుగానే నైజాం సర్కారుతో పాటు ఆర్ఎస్ఎస్ పనిచేసిందన్నారు. సంస్కృతాన్ని దేశం అంతా రుద్దాలని, హిందీని ప్రథమ బాషగా మార్చేందుకు, ప్రయత్నిస్తోందన్నారు. నైజాం సర్కారు కూడా ఉర్దూని తెలుగు ప్రజలపై రుద్దారన్నారు. నైజాం సర్కారుతో పాటు ఆర్ఎస్ఎస్‌కు కూడా జాతీయోద్యమంలో పాల్గొన్నచరిత్ర లేదన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి కోసం పోరాటం చేస్తే నేడు పాలకవర్గాలు భూమిని కార్పొరేట్లకు పందేరం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. మా భూమి మాకే దక్కాలంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతున్నాయన్నారు కార్పొరేట్ దోపిడీకి వ్యతిరేకంగా భూ రక్షణ కోసం ప్రజలు, రైతులు, ప్రజాసంఘాలు ఐలమ్మ స్ఫూర్తితో పోరాటాలను ముందుకు తీసుకెళ్ళాలన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ తెలంగాణ పోరాటంలో దున్నేవానికే భూమి దక్కాలంటూ ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. నైజాం సర్కారుకి, రజాకార్లకు వ్యతిరేకంగా కుటుంబానికి ఎన్ని కష్టాలు వచ్చినా లెక్కచేయకుండా పోరాడారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు, రాంభూపాల్, ప్రజాశక్తి ఎడిటర్ తులసీదాస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు వై.కేశవరావు, కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు, గిరిజన సంఘం నాయకులు కిలారి సురేష్, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, ఐద్వా నాయకులు శ్రీదేవి , సిఐటియు రాష్ట్ర నాయకులు కారుసాల సుబ్బారావమ్మ పాల్గొన్నారు.


తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధ చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న బివి రాఘవులు

బిల్డింగ్ ట్రిబ్యునల్ ఏర్పాటుకు ఎందుకు ఆలస్యం?

- సిఆర్‌డిఎ కమిషనరుకు హైకోర్టు ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి

సిఆర్‌డిఎ పరిధిలో వివాదాల పరిష్కారం కోసం బిల్డింగ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసేందుకు ఎందుకు ఆలస్యం చేస్తున్నారని సిఆర్‌డిఎ కమిషనరును హైకోర్టు ప్రశ్నించింది. రాజధాని ప్రాంతంలో పలు సంస్థలు ఏర్పాటవుతున్నందున నిర్దిష్ట గడువు పెట్టుకుని ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలంది. కౌంటర్ దాఖలు చేయాలని సిఆర్‌డిఎను ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేస్తూ చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సిఆర్‌డిఎ చట్టంలోని సెక్షన్లు 114, 115, 116, 118 ప్రకారం బిల్డింగ్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయకపోవడాన్ని సవాల్ చేస్తూ సొసైటీ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ ప్రాపర్టీ అండ్ ఎన్విరాన్మెంటల్ రైట్స్ సంస్థ అధీకృత కార్యదర్శి యేము కొండలరావు పిల్ దాఖలు చేశారు. సిఆర్‌డిఎ పరిధిలో అక్రమ నిర్మాణాలు, మాస్టర్ ప్లాన్ ఉల్లంఘనలు, నిర్మాణ ఉల్లంఘనల సమస్యల పరిష్కారానికి ట్రిబ్యునల్ అవసరం ఎంతగానో ఉందని న్యాయవాది కృష్ణ దీప్తి వాదించారు. దీనిపై సిఆర్‌డిఎ న్యాయవాది సింగమనేని ప్రణతి ప్రతివాదన చేస్తూ, ఈ అంశం సిఆర్‌డిఎ కమిషనరు పరిశీలనలో ఉందన్నారు. వివరాల సమర్పణకు గడువు కావాలని కోరడంతో 2 వారాలు ఇస్తూ హైకోర్టు ఆదేశించింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్లే ఎరువుల కొరత

- ఎపి రైతు, కౌలు రైతు సంఘాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో యూరియా కొరత లేదని ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు ప్రకటనలు చేస్తూ.. అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఎపి రైతు సంఘం, కౌలు రైతు సంఘాలు పేర్కొన్నాయి. ఈ మేరకు సంయుక్త ప్రకటనను ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి బుధవారం విడుదల చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యల వల్లే ఎరువుల కొరత తలెత్తిందని విమర్శించారు. గత 10 రోజులుగా వివిధ జిల్లాల్లో యూరియా కోసం బారులు తీరిన రైతులకు సంబంధించిన కథనాలు మీడియాలో వస్తున్నాయని పేర్కొన్నారు. ఎరువుల కొరత వెనుక అసలు కథ వేరే ఉందన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎరువుల విధానం'ను కేంద్ర ప్రభుత్వం 2022 అక్టోబరు 2 నుంచి అమలు చేస్తుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎరువుల కర్మాగారాలను ప్రైవేటువారికి కట్టబెట్టడానికి కేంద్ర మంత్రివర్గం తీర్మానం చేసిందన్నారు. ఉత్పత్తి పంపిణీ నుంచి ప్రభుత్వం వెనక్కు తగ్గే విధానంలో 10 నుంచి 30 శాతం స్వదేశీ ఉత్పత్తి, విదేశీ దిగుమతులను తగ్గించిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. ఇటువంటి రైతు వ్యతిరేక కార్యక్రమాలకు ముఖ్యమంత్రి ఢిల్లీలో ఒప్పుకుని వచ్చి, ఇక్కడ అసత్యాలు చెప్పడం సరికాదన్నారు. కేంద్రంలోని బిజెపికి లొంగిపోయి రాష్ట్ర రైతులను మోసం చేయడం మానుకుని, వెంటనే రైతులకు అవసరమైన ఎరువులను తెప్పించాలని కోరారు.

గ్రంథాలయాల పోస్టులు భర్తీ చేయాలి

- ధర్నాలో మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న గ్రంథాలయ పోస్టులను భర్తీ చేయాలని పిడిఎఫ్ మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు డిమాండ్ చేశారు. గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నా చౌక్‌లో బుధవారం ధర్నా జరిగింది. డివైఎఫ్ఐ నాయకులు పి కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో లక్ష్మణరావు మాట్లాడుతూ గ్రంథాలయ కోర్సులు చేసిన విద్యార్థులు రాష్ట్రంలో సుమారు 2లక్షల మంది ఉన్నారని తెలిపారు. 15 నుంచి 20వేల పోస్టుల వరకు గ్రంథాలయాల్లో ఖాళీగా ఉన్నాయని చెప్పారు. జిల్లా గ్రంథాలయాలు, శాఖ గ్రంథాలయాల్లో ఎక్కువ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలల్లో గ్రంథాలయాలు ఏర్పాటు చేసి అసిస్టెంట్‌లను నియమించాలని కోరారు. ప్రతి గ్రామ పంచాయతీలో డిజిటల్ లైబ్రరీలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఖాళీ పోస్టుల భర్తీ వల్ల కొంతమంది యువతకు ఉపాధి దొరుకుతుందని చెప్పారు. డివైఎఫ్ఐ రాష్ట్రకార్యదర్శి జి రామన్న మాట్లాడుతూ గతంలో ఎపిపిఎస్‌సి దగ్గర నిలిచిన జూనియర్, డిగ్రీ కళాశాలల లైబ్రేరియన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలని కోరారు. గతంలో మాదిరిగా హైస్కూళ్లల్లో లైబ్రరీలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పోస్టుల భర్తీకి ప్రభుత్వం ముందుకు రాకపోతే రాబోయే రోజుల్లో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు.ఎపి గ్రంథాలయ అసోసియేషన్ కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ గ్రంథాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న లైబ్రరీ సెస్‌ను జమచేయాలని, వీటిని నేరుగా గ్రంథాలయ సంస్థల ఖాతాలోకి వచ్చే విధంగా సాఫ్ట్‌వేర్‌ను తయారు చేయాలని కోరారు. పనివేళలు మార్చి ఉద్యోగులకు 010 పద్దు ద్వారా జీతాలు చెల్లించాలని తెలిపారు. ఎపి గ్రంథాలయ పునర్వికాస ఉద్యమ వేదిక కార్యదర్శి లక్ష్మయ్య మాట్లాడుతూ టెక్నాలజీ ఎంత పెరిగినా గ్రంథాలయాలకు ప్రాముఖ్యత తగ్గదన్నారు. ఎపి లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జెఎసి కన్వీనర్ కె జగదీష్ మాట్లాడుతూ ఉద్యోగులు పదవి విరమణ పొందుతున్నా ఖాళీలను భర్తీ చేయడం లేదన్నారు. భర్తీకోసం నోటిఫికేషన్ విడుదల చేసి కేవలం గ్రంథాలయ విద్య అభ్యసించిన వారితోనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రబడ్జెట్‌లో నిధులు కేటాయించి ఖర్చు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు పిచ్చయ్య, కృష్ణకాంత్, నిజం, శివ, లైబ్రరీ సైన్స్ నిరుద్యోగ జెఎసి నాయకులు రమేష్, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.



వరుస మరణాలకు కారణాలు అన్వేషించాలి

- మృతుల కుటుంబ సభ్యులకు సిపిఎం బృందం పరామర్శ

ప్రజాశక్తి - గజపతినగరం/విజయనగరం ప్రతినిధి

విజయనగరం జిల్లా గజపతినగరం మండలం మరుపల్లిలో అంతుచిక్కని వ్యాధులతో మరణించిన కుటుంబీకులను సిపిఎం నాయకుల బృందం బుధవారం పరామర్శించింది. జర్వం, శ్వాశకోశ ఇబ్బందులతో రెండు నెలల వ్యవధిలో ఏడుగురు మరణించారంటూ బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. ధైర్యంగా ఉండాలని మిగిలిన కుటుంబ సభ్యుల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని బాధితులను సిపిఎం నాయకులు ఓదార్చారు. ఈ మరణాలపై ఈ నెల తొమ్మిదిన 'ఆగ్రామానికి ఏమైంది' అంటూ ప్రజాశక్తిలో ప్రత్యేక కథనం వెలువడడంతో గ్రామంలో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యాన ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యారోగ్య శాఖ జిల్లా అధికారి డాక్టర్ జీవన రాణి గ్రామాన్ని సందర్శించారు. తీవ్ర జ్వరంతో వణికిపోతున్న గ్రామస్తురాలు నారాయణమ్మను స్థానిక పిహెచ్‌సి వైద్యులు 108 వాహనంలో గజపతినగరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ నేపథ్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ నాయకత్వంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టివి రమణ, వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాసరావు గ్రామాన్ని సందర్శించారు. అనంతరం పిహెచ్‌సిలోని డాక్టర్ సాయి కృష్ణారెడ్డి, గ్రామ సచివాలయంలో స్థానిక పంచాయతీ కార్యదర్శి మంత్రి రమణతో సిపిఎం నాయకులు చర్చించారు. తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ అంబులెన్సులు అందుబాటులో ఉంచాలని, గ్రీన్ అంబాసిడర్లకు పెండింగ్ వేతనాలు, కిట్లను అందజేయాలని డిమాండ్ చేశారు.


మృతుల కుటుంబీకులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సూపర్ సిక్స్.. సూపర్ ఫ్లాప్

- ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూపర్ సిక్స్ హామీల్లో ఒక్కటైనా పూర్తిగా అమలు చేయకుండా సూపర్ హిట్ అంటూ ప్రభుత్వం చెప్పుకోవడం సిగ్గు చేటని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల విమర్శించారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌ను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా సూపర్ ఫ్లాప్ చేసిందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 50 లక్షల మంది నిరుద్యోగులుంటే ఒక్కరికైనా నిరుద్యోగ భృతి ఇచ్చారా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన 20 లక్షల ఉద్యోగాలు ఇంకెప్పుడిస్తారన్నారు. స్థాపించని పరిశ్రమల యాజమాన్యాలతో అగ్రిమెంట్లు చేసుకున్నంత మాత్రాన యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయన్నారు. ఒక్కరికీ భృతి ఇవ్వకుండా, ఒక్క ఉద్యోగం రాకుండా సూపర్ సిక్స్ సూపర్ హిట్ ఎలా అవుతుందని ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకూ నెలకు రూ.1,500 ఆర్థిక సాయం అనేది సూపర్ సిక్స్ హామీ అని, ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. అన్నదాత సుఖీభవలో భాగంగా ప్రతి రైతుకు రూ.20 వేలు ఇస్తామని చెప్పి కేంద్రం ఇచ్చే పిఎం కిసాన్‌తో లింక్ పెట్టారన్నారు. కేవలం 44 లక్షల మంది రైతులకే మొదటి విడత మొత్తం జమ చేసి, 30 లక్షల మందికి పథకం దక్కకుండా పంగనామాలు పెట్టారని విమర్శించారు. తల్లికి వందనం పథకంలో 87 లక్షల మంది పిల్లలకు కేవలం 67 లక్షల మందికే రూ.13 వేలు చెల్లించారన్నారు. గోరంత చేసి కొండంత చెప్పుకోవడం కూటమి ప్రభుత్వానికే చెల్లుతుందని పేర్కొన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు 50 ఏళ్లకే పెన్షన్‌లు ఇస్తామని చెప్పి అమలు చేయలేదన్నారు. విద్యుత్ ఛార్జీల నియంత్రణ, పెట్రోల్, డీజిల్ ధరల తగ్గింపు తదితర అంశాల్లో ప్రజలను కూటమి ప్రభుత్వం పూర్తిగా మోసం చేసినట్లు తెలిపారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న శివధాసన్

ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకుందాం

- రాజ్యసభ సభ్యులు శివధాసన్

ప్రజాశక్తి-కడప అర్బన్

దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ప్రభుత్వ రంగ సంస్థలైన ఎల్ఐసి, జాతీయ బ్యాంకులను కేంద్ర ప్రభుత్వ విధానాలు బలహీన పరుస్తున్నాయని రాజ్యసభ సభ్యులు శివధాసన్ అన్నారు. 'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు - ప్రభుత్వ రంగ సంస్థలు, విద్య, ప్రజారోగ్య రంగాలపై ప్రభావం' అనే అంశంపై కడప యుటిఎఫ్ భవన్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సెమినార్ నిర్వహించారు. సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ ఎ.రఘునాథరెడ్డి సెమినార్‌కు అధ్యక్షత వహించారు. శివధాసన్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలలో రెగ్యులర్ ఫ్యాకల్టీ లేరని, విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోయాయని తెలిపారు. ఆరోగ్య రంగంలో బడ్జెట్ కేటాయింపులు తగ్గిపోవడం వల్ల చిన్న, చిన్న ఆరోగ్య సమస్యలను కూడా నియంత్రించలేని దుస్థితి నెలకొందన్నారు. ఇలాంటి కేంద్ర ప్రభుత్వానికి టిడిపి, వైసిపి మద్దతునిస్తున్నాయని విమర్శించారు. విగ్రహాలకు రూ.వందల కోట్లు ఖర్చు పెడుతున్న ప్రభుత్వాలు స్కూళ్లు, ఆస్పత్రులను మాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వ్యవస్థలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. పెన్షన్ సదుపాయం రాజ్యాంగ హక్కు అని పాలకులు గుర్తించాలన్నారు. ప్రభుత్వాల పట్ల ప్రజలు, పేదల్లో వ్యతిరేకత పెరుగుతోందని, దీనిని దారి మళ్లించేందుకు భాష, మతం, ప్రాంతం ఆధారిత సమస్యలను పాలకులు రెచ్చగొడుతున్నారని విమర్శించారు. రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రవచించిన విశ్వమానవ భావనతో కేరళ తరహా ప్రత్యామ్నాయ విధానాల కోసం కార్మికులు, కర్షకులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఐక్యం కావాలని కోరారు. సెమినార్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘాల సమన్వయ కమిటీ నాయకులు అవధానం శ్రీనివాస్, శ్రీనివాసరెడ్డి, లక్ష్మీరాజా, నాగమునిరెడ్డి, రాజశేఖర్ రాహుల్, రవి తేజ, ఎన్.శివశంకర్, రామ్మూర్తి నాయుడు, అజీజ్, లలిత, రామకృష్ణారెడ్డి, సుధాకర్, వెంకటరామరాజు, సుబ్బారెడ్డి, డి.మొహమ్మద్, ఎ.సుబ్బారావు, వి.రామంజులరెడ్డి, నరసింహారెడ్డి, నాగేష్, అక్బర్ బాషా, జి.శ్రీనివాసులు, అయ్యవారురెడ్డి, వారిజాతమ్మ, రాజు, కుమార్, కిషోర్, చిన్నయ్య, సాదక్ పాల్గొన్నారు.



టిటిడి ఇఒగా సింఘాల్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - తిరుమల

టిటిడి ఇఒగా రెండోసారి అవకాశం రావడంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని అనిల్‌కుమార్ సింఘాల్ అన్నారు. బుధవారం తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టిటిడి పూర్వపు ఇఒ శ్యామలరావు నుంచి ఆయన బాధ్యతలను స్వీకరించారు. శ్రీవారి ఆలయంలో టిటిడి బోర్డ్ మెంబర్ సెక్రటరీ ఎక్స్ అఫిషియోగా ప్రమాణం చేశారు. వీరితో టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి ప్రమాణం చేయించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు.

శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటాన్ని వెంకయ్య చౌదరి అందించారు. ఆలయం ముందు సింఘాల్ మీడియాతో మాట్లాడుతూ రెండోసారి అవకాశాన్ని కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. మొదటిసారి 2017, మే నుంచి 2020, అక్టోబర్ వరకూ మూడు సంవత్సరాల నాలుగు నెలలు సేవలు అందించానని చెప్పారు. యాత్రికుల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరించి సేవల నాణ్యతను పెంచేలా నిర్ణయాలు తీసుకుంటామన్నారు. సాధారణ యాత్రికులకు న్యాయం చేసేందుకు టెక్నాలజీ వినియోగంపై దృష్టి పెడతామని చెప్పారు. ఇతర రాష్ట్రాల రాజధానుల్లోనూ వెంకటేశ్వర స్వామి దేవాలయాలు నిర్మించే ఆలోచన చేస్తున్నామన్నారు. టిటిడి అధికారులు చిత్తశుద్ధితో రేయింబవళ్ళు కృషి చేసి ఉత్సవాలను విజయవంతం చేస్తున్నారని చెప్పారు. అనంతరం టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

ప్రైవేటీకరణతో సామాన్యులకు అందని పర్యాటకం

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రైవేటీకరణ వల్ల సామాన్య ప్రజలకు పర్యాటకం అందుబాటులో ఉండదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ తెలిపారు. ఈ అంశంపై దాసరి భవన్‌లో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. పర్యాటక రంగంలో రూ.10 వేలకోట్ల విలువైన 22 హోటళ్లు, రిసార్ట్‌లు, ఆస్తులను ప్రైవేటుపరం చేయడం దుర్మార్గమన్నారు. దీంతో ఈ రంగంలో పనిచేస్తున్న 1,300 మంది ఉద్యోగుల కుటుంబాలు రోడ్డున పడేలా చేశారని పేర్కొన్నారు.

ప్రభుత్వ చర్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రతి రంగాన్ని ప్రైవేటుపరం చేసుకుంటూ పోతే ప్రభుత్వం ఎందుకని ప్రశ్నించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ.. కార్మికులు, ప్రజలు, ఉద్యోగులు కష్టపడి సృష్టించిన ప్రభుత్వ సంపదను ప్రైవేటుకు ధారాదత్తం చేసే నిర్ణయానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, ఎపిటిడిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి రామకృష్ణ, పిటి ప్రసాద్, సిపిఐ(ఎంఎల్) నాయకులు పోలారి, ఎఐటియుసి నాయకులు వెంకటసుబ్బయ్య తదితరులు ప్రసంగించారు.

లారీ బీభత్సం

- ఇద్దరు గొర్రెల కాపరులు మృతి

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్, ఆనందపురం

వైఎస్ఆర్ కడప, విశాఖ జిల్లాల్లో లారీలు బీభత్సం సృష్టించడంతో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. మూగజీవాలను తీసుకువెళ్తున్న ఇద్దరు కాపరులు, 55 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా రుద్రవరం మండలం నల్లాపల్లెకు చెందిన కృష్ణయ్యకు రెండు వందల గొర్రెలు ఉన్నాయి. నెల రోజులుగా జమ్మలమడుగు మండలం గండికోట ఆంజనేయస్వామి దేవాలయం వద్ద స్థావరాన్ని ఏర్పాటు చేసుకుని మూగజీవాలను మేపుకుంటున్నారు. గొర్రెలను ఇంటికి తరలించేందుకు నంద్యాల నుంచి జమ్మలమడుగుకు ఇద్దరు కాపరులు వచ్చారు. మంగళవారం అర్ధరాత్రి జమ్మలమడుగు-తాడిపత్రి బైపాస్ మీదుగా మూగజీవాలను తీసుకువెళ్తుండగా గుర్తుతెలియని లారీ గొర్రెలను, కాపరులను ఢీకొట్టింది. కాపరి వరద వెంకటేశ్ (50) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మరో కాపరి నరసింహులు (35)ను కర్నూలుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించారు. ఈ ప్రమాదంలో 15 గొర్రెలు కూడా మరణించాయి.

విశాఖ జిల్లా పెందుర్తి నుంచి ఆనందపురం వైపు వస్తున్న లారీ అదుపుతప్పి గొర్రెల మందను ఢీకొట్టింది. ఆనందపురం మండలం పేకేరు గ్రామానికి చెందిన రైతులు చందక సూర్యనారాయణ, చందక వీరుబాబుకు చెందిన 40 మూగజీవాలు మృతి చెందాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ఉద్యమాలతోనే హక్కుల సాధన

- వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల సంక్షేమమే తమ లక్ష్యం
- 'ప్రజాశక్తి'తో వ్యకాసం జాతీయ నేతలు

ప్రజాశక్తి - ప్రత్యేక ప్రతినిధి (కడప)

వ్యవసాయ కార్మికులు, గ్రామీణ పేదల సంక్షేమమే తమ లక్ష్యమని, హక్కుల సాధనకు అండగా ఉంటామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) జాతీయ నేతలు చెప్పారు. కడపలో ఈ నెల ఎనిమిది నుంచి పది వరకు జరిగిన ఎఐఎడబ్ల్యుయు జాతీయ కౌన్సిల్ సమావేశాలకు 20 రాష్ట్రాల నుంచి 200 మంది ప్రతినిధులు హాజరయ్యారు. గత కౌన్సిల్లో రూపకల్పన చేసిన పోరాటాలపై సమీక్షించి, భవిష్యత్ ఉద్యమాలపై కార్యాచరణ రూపొందించారు. గ్రామీణ వ్యవసాయ కార్మికులు, పట్టణ నగర వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు తమ పోరాట అనుభవ, ఫలితాలను 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు.

'చలో ఢిల్లీ' పోరాటం మహత్తర ఘట్టం : బుపేంద్రసింగ్, జాతీయ ఉపాధ్యక్షులు, పంజాబ్



దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి అనేక పోరాటాలు చేశాం. వేతనాల పెంపు, కనీస వేతనాల అమలు, భూమిలేని వ్యవసాయ కార్మికులకు గృహస్థలాలు, సాగుభూమి వంటి డిమాండ్లపై నిరంతర ఉద్యమాలు చేపట్టాం. 2020-21లో జరిగిన 'చలో ఢిల్లీ' ఉద్యమంలో ఎఐఎడబ్ల్యుయు ముందుండి వ్యవసాయ కార్మికుల గళాన్ని వినిపించింది. రుణమాఫీ, గ్రామీణ గృహ హక్కులు, భూ హక్కులు, ఎంఎస్‌పికు చట్టబద్ధ హామీ, నరేగా పనిదినాల పెంపు, వేతనాల చెల్లింపుల కోసం 2023-24లో వేలాది మంది కార్మికులతో ఆందోళనలు నిర్వహించాం. కార్మికుల చెమట చుక్కకు గౌరవం దక్కే వరకూ, ఎంఎస్‌పికి చట్టబద్ధ హామీ లభించే వరకూ మా పోరాటం కొనసాగుతోంది. సామాజిక అణచివేతకు వ్యతిరేకంగానూ 2016, 2018, 2020లో సంగ్రూర్, బర్నాలా, మలేర్‌కోట్‌లా జిల్లాల్లో ఉద్యమాలు చేశాం.

'ఉపాధి' వేతనం రూ.600 : లలితాబాలన్, కేరళ ఉమెన్ సబ్‌కమిటీ కన్వీనర్



మా రాష్ట్రంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం వేతనదారులకు రోజుకు రూ.600 అమలు చేస్తున్నాం. మరే రాష్ట్రంలో ఇంత ఇవ్వడం లేదు. ఈ విషయంలో దేశానికి కేరళ ఆదర్శంగా నిలిచింది. 1985లోనే వ్యవసాయ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును రాష్ట్రంలో అధికారికంగా ఏర్పాటు చేశాం. ఈ బోర్డు ద్వారా వ్యవసాయ కార్మిక సంఘం పిల్లలకు స్కాలర్‌షిప్పులు, వివాహ సమయంలో రూ.25వేలు, వయస్సు మళ్లిన కార్మికులకు పింఛన్లు అందిస్తున్నాం. కేరళలో 27.62 లక్షల మంది సభ్యులుగా ఉన్నారు. ఇందులో 62 శాతం మహిళలే ఉన్నారు. మహిళలు ఎక్కువగా ఉండడంతో సంఘం తరపున కేరళ కన్వెన్షన్ ఏర్పాటు చేశాం. ఉమెన్స్ సబ్‌కమిటీ ఏర్పాటయ్యింది. కేంద్రం అమలు చేయాల్సిన భూ పంపిణీ, కనీస వేతనాల పెంపు, పింఛన్ల అమలు, రేషన్ పంపిణీ తదితర డిమాండ్లపై తిరువనంతపురంలో 15వేల మందితో ర్యాలీ నిర్వహించి విజయం సాధించాం. వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేరళ ప్రభుత్వం కట్టుబడి ఉంది.

భూమి కోసం ఉద్యమాలు : ముని వెంకటప్ప, కర్ణాటక రాష్ట్ర ఉపాధ్యక్షులు



కర్ణాటక రాష్ట్రంలో ప్రభుత్వ, కార్పొరేట్ శక్తుల చేతుల్లో ఉన్న భూములను పేదలకు పంచాలనే ఏకైక డిమాండ్‌తో భవిష్యత్ ఉద్యమాలు చేపట్టనున్నాం. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిరంతరంగా ఉండకపోవడంతో మైక్రో ఫైనాన్స్ వలలో చిక్కుకున్న కార్మికులు దినసరి కూలీలుగా మారిపోతున్నారు. రేషన్‌లో బియ్యం తప్ప ఇతర ఏ వస్తువులూ ఇవ్వడం లేదు. కొప్పాలలో ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలివ్వాలని పోరాడి సాధించుకున్నాం.

పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి హామీ అమలు : అమృతలింగం, తమిళనాడు రాష్ట్ర అఖిల భారత కౌలు కార్మికుల సంఘం



పట్టణ, నగర ప్రాంతాల్లో ఉపాధి హామీ అమలు చేయడం అనేది మా సంఘం పోరాట విజయం. ఈ స్ఫూర్తితో దేశవ్యాప్తంగా పట్టణ, నగర ప్రాంతాల్లో ఉపాధి హామీ అమలయ్యేలా ఉద్యమాలను నిర్వహించాల్సి ఉంది. 2015లో పట్టాలేని ఇళ్లపై ప్రభుత్వం విధించిన హౌస్‌ట్యాక్స్‌కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమించాం. ఈ పోరాటం ముఖ్యంగా చెన్నై, మధురై, తంజావూరు, కడలూరు వంటి జిల్లాల్లో కదలికలు సృష్టించింది. ఆందోళనల తీవ్రతతో చివరకు ప్రభుత్వం పన్ను మినహాయింపునిచ్చింది. కార్మికులకు జీవన భరోసాకు ప్రత్యేక నిరుద్యోగ పథకాలు, వ్యవసాయ కార్మికుల కోసం ప్రత్యేకంగా మైక్రో ఫైనాన్స్ పథకాన్ని ప్రవేశపెట్టాలి. దీనిద్వారా కార్మికులకు తక్షణ ఆర్థిక సాయం, అప్పుల బారిన పడకుండా జీవనోపాధి కొనసాగుతుంది.

ఇళ్లస్థలాలకే ప్రాధాన్యత : నాగయ్య, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి



పట్టణ వ్యవసాయ కార్మికులకు జానెడు ఇంటి స్థలం కోసం ఉద్యమాలు చేపట్టాం. 2022లో చేపట్టి భూ పోరాటం ఫలితంగా మహబూబ్‌నగర్ జిల్లాలో ఆరువేల ఎకరాలు, మంచిర్యాల జిల్లాలో 200 ఎకరాలు గిరిజనులకు దక్కాయి. తెలంగాణ వ్యాప్తంగా 11 లక్షల సభ్యత్వం ఉంది. రాష్ట్రంలో అప్పటి ముఖ్యమంత్రి కెసిఆర్ ఇంటింటి సర్వే చేసి 31లక్షల మందికి ఇళ్లు లేవని తేల్చారు. డబుల్‌బెడ్ రూము ఇళ్లను నిర్మించి లక్ష మందికే ఇచ్చారు. ఇళ్లస్థలాల సమస్య తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో వ్యవసాయ కార్మిక సంఘంగా సర్వే నిర్వహించి సీలింగ్, భూదాన, అసైన్డ్, దేవాదాయ భూములు పది లక్షల ఎకరాలు ఉన్నట్లు గుర్తించింది.

19 జిల్లాల్లోని పేదలకు వీటిని పంచాలన్న ప్రధాన డిమాండ్‌తో ఉద్యమాలు చేపట్టనున్నాం. జగిత్యాల జిల్లాలో 200 ఎకరాల్లో ఎర్రజెండా పాతి పేదలకు ఇంటి స్థలాలు దక్కేలా చేశాం. తెలంగాణాలో ఎక్కువమంది మహిళలే సంఘానికి నాయకత్వం వహించేలా ముందుకు వస్తున్నారు. ఇది శుభపరిణామం.

అంబలి కేంద్రాలు నిర్వహించాం : సరితా శర్మ, మహారాష్ట్ర మహిళా సబ్‌కమిటీ కన్వీనర్



మహారాష్ట్రలో 2014లో తీవ్ర కరువు తాండవించినప్పుడు రాష్ట్ర సర్కారు కానీ, కేంద్ర ప్రభుత్వం గానీ ఆదుకోలేదు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంబలి కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలంటూ 2017 జూన్‌లో సమ్మెలోకి వెళ్లి మద్దతు ధర సాధించుకున్నాం. అప్పటి ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ రూ.30 వేల కోట్ల రుణమాఫీ పథకాన్ని ప్రకటించారు. ఇది రైతులు, వ్యవసాయ కార్మికుల సంఘటిత విజయం. 2018లో కిసాన్ లాంగ్‌మార్చ్ పేరుతో 70 వేల మందితో నాసిక్ నుంచి ముంబైకి 180 కిలోమీటర్ల పాదయాత్ర చేశాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి రైతులకు పూర్తి రుణమాఫీ, అటవీ హక్కు చట్టం అమలు, నష్టపరిహారం ప్రకటించాయి. వ్యవసాయ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని 2018 ఆగస్టులో దాదాపు రెండు లక్షల మంది రైతులు, వ్యవసాయ కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. నాసిక్‌లో దాదాపు 800 మంది చిన్న రైతులు కలిసి స్థాపించిన ఈప్రొడ్యూసర్ కంపెనీ ద్రాక్షను ఎగుమతి చేసి రూ.800 కోట్ల ఆదాయాన్ని సమకూర్చడం పెద్ద విజయం.

ఆటో కార్మికుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - తణుకు

స్త్రీ శక్తి పథకం అమలుతో కిరాయిలు లేక, ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక ఆటో కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. వేల్పూరు గ్రామానికి చెందిన ఆటో కార్మికుడు కోల రాంబాబు (35) ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. గతంలో రోజువారీ ఆటో తోలకం ద్వారా రూ.600 తగ్గకుండా ఆదాయం ఆర్జించేవారు. 'స్త్రీ శక్తి' పథకం తర్వాత ఆదాయం క్రమేపీ తగ్గుతూ ప్రస్తుతం రూ.200 కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది. దీంతో కుటుంబం గడవక, ఆటో ఫైనాన్స్ వాయిదాలు చెల్లించలేక బుధవారం పురుగుమందు తాగి ఆత్యహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబ సభ్యులు, తోటి ఆటో కార్మికులు తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఆయనను ఆటో అండ్ ట్రాలీ కార్మికుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు తదితరులు పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం తర్వాత రాష్ట్రంలో ఆటో డ్రైవర్లందరి పరిస్థితి ఇలాగే ఉందని, రాంబాబుకు రూ.5 లక్షలు సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

గిరిజనులకు తప్పని డోలీ మోత

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

ఇటీవల బొబ్బిలి మండలంలోని కొత్త బట్టివలస గిరిజన గ్రామంలో డోలీ మోత సంఘటన మరువక ముందే బుధవారం అనారోగ్యంతో బాధపడుతున్న గోపాలరాయుడుపేట పంచాయతీ నారసింహునిపేట సమీపంలోగల మోశాయివలసకు గిరిజన మహిళ చోడిపల్లి ఆశమ్మను డోలీలో ఆస్పత్రికి తరలించారు. విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం మోశాయివలస గ్రామానికి చెందిన ఆశమ్మ గత కొంతకాలంగా కేన్సర్‌తో బాధపడుతున్నారు. ఆమెకు బుధవారం ఆరోగ్యం క్షీణించడంతో గ్రామం నుంచి దిబ్బగుడ్డి వలస వరకు డోలీపై కుటుంబ సభ్యులు తీసుకువచ్చారు. అక్కడి నుంచి టాటా ఎసి వాహనంపై విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. ఈ గ్రామం బొబ్బిలి మండల కేంద్రానికి తొమ్మిది కిలోమీటర్ల దూరంలోనూ, నారసింహునిపేట పంచాయతీకి మూడు కిలోమీటర్ల దూరంలోనూ ఉంది. మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న గ్రామానికి కూడా రహదారి సౌకర్యం లేకపోవడంతో తరచూ గిరిజనులు అనారోగ్యం బారిన పడిన సందర్భంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించి ఆదుకోవాలని కోరారు.



గిరిజన మహిళ ఆశమ్మను డోలీలో ఆస్పత్రికి తరలిస్తున్న గిరిజనులు

కెఆర్‌పి డ్యాంలో దూకి... కుటుంబం ఆత్మహత్యాయత్నం

- అత్త, అల్లుడు మృతి
- చికిత్స పొందుతున్న తల్లీకూతురు

ప్రజాశక్తి - కుప్పం (చిత్తూరు జిల్లా) :

కుటుంబ కలహాల నేపథ్యంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు చిత్తూరు జిల్లా కుప్పం సరిహద్దులోని తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరి కెఆర్‌పి డ్యామ్ దూకి ఆత్మహత్యాయత్యానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం ప్రనకారం... కుప్పం పట్టణం జయప్రకాష్ రోడ్డుకు చెందిన లక్ష్మణమూర్తి చిన్నపాటి అంగడిని నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం కుటుంబ కలహాలతో క్రిష్ణగిరి కెఆర్‌పి డ్యామ్‌లో లక్ష్మణ్ మూర్తి (50), ఆయన భార్య జ్యోతి (40), కుమార్తె కీర్తిక (20), జ్యోతి తల్లి శారదమ్మ (70) డ్యాంలోకి దూకారు. వీరిలో లక్ష్మణమూర్తి, శారదమ్మ మృతి చెందగా జ్యోతి, కీర్తికను జాలర్లు రక్షించి క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబం మొత్తం కుప్పంకు దాదాపు 50 కిలోమీటర్ల దూరంలోని కెఆర్‌పి డ్యాంలో దూకి ఆత్మహత్యాయత్నం పాల్పడడం స్థానికంగా కలకలం రేపుతోంది. తమిళనాడు రాష్ట్రం క్రిష్ణగిరి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతోన్న ఉపరితల ఆవర్తనం

- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి సగటున 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్‌జైన్ తెలిపారు.

ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 11న అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో పలుచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

అచ్యుతాపురంలో 61 మిల్లీమీటర్లు నమోదు

రాష్ట్రంలో పలుచోట్ల బుధవారం వర్షపాతాలు నమోదయ్యాయి. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో 61 మిల్లీమీటర్లు, యలమంచిలిలో 60.2, తూర్పుగోదావరి జిల్లా పైడిమెట్టలో 49.5, నంద్యాల జిల్లా ముత్యాలపాడులో 49, అనకాపల్లి జిల్లా చోడవరంలో 48.2 మిల్లీమీటర్లు చొప్పున వర్షపాతాలు నమోదయ్యాయి.

అనిల్ అంబానీకి ఇడి మరో షాక్

- బ్యాంక్ మోసంలో కొత్త కేసు నమోదు



ముంబయి : రిలయన్స్ గ్రూప్ సంస్థల అధినేత అనిల్ అంబానీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మరో షాక్ ఇచ్చింది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)ను రూ.2,929.05 కోట్లకు మోసం చేసిన రుణ కేసులో రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్‌కామ్) డైరెక్టర్‌గా ఉన్న అనిల్ అంబానీపై ఇడి కొత్త కేసు నమోదు చేసింది. అనిల్ అంబానీతో పాటు పలువురు ప్రభుత్వ అధికారులు, ఇతరుల పైనా కేసు నమోదయ్యిందని తెలుస్తోంది. గత నెలలో సిబిఐ దాఖలు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఇడి ఈ చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఎస్‌బిఐ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పలు బ్యాంకులకు అనిల్ అంబానీ నేతృత్వంలోని ఆర్‌కామ్ రూ.40 వేల కోట్లకు పైగా రుణాలు బకాయిలుపడింది. 2018 నాటి గణాంకాల ప్రకారం ఒక్క ఎస్‌బిఐనే రూ.2929 కోట్ల మేర నష్టపోయింది. ఆర్‌కామ్ అనుకూలంగా రుణాలు పొందేందుకు ఎస్‌బిఐను తప్పుదోవ పట్టించారు. ఈ నేరపూరిత కుట్రలో కంపెనీ డైరెక్టర్లు సహా పలువురు అధికారులు పాలుపంచుకున్నారని ఇడి నిర్ధారణకు వచ్చింది. బ్యాంక్‌ల నుంచి రుణాలు తీసుకుని మోసం చేసిన కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) విచారణ ప్రారంభించగా.. సిబిఐ కూడా సోదాలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసు అంశంలో ఆగస్టులో అనిల్ అంబానీని ఇడి 10 గంటల పాటు ప్రశ్నించింది.

మనీలాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేసింది. నష్టాల్లో చిక్కుకున్న టెలికాం సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) తీసుకున్న రుణాన్ని కొన్ని నెలల క్రితం మోసపూరిత చర్య అని ఎస్‌బిఐ నిర్ణయించిన విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ మార్గదర్శకాల ప్రకారం.. ఏదైనా ఒక బ్యాంకు, ఒక ఖాతాను మోసపూరితమైందని గుర్తించిన తర్వాత ఆ విషయాన్ని 21 రోజుల్లోగా ఆర్‌బిఐకి సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. కేసును సిబిఐ, పోలీసులకు రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఎస్‌బిఐ ఫిర్యాదు మేరకు సిబిఐ, ఇడి కేసు నమోదు చేసింది.

గూడూరులో యువకుడి దారుణహత్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్

తిరుపతి జిల్లా గూడురులో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గూడురు గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహ సముదాయంలో నివసిస్తున్న రహీద్ బాషా అలియాస్ మున్నా (35) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. స్థానిక గాంధీనగర్ సమీపంలోని స్మశానం వద్ద రక్తపు మడుగులో రహీద్ పడి ఉండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. వారు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. రహీద్ హత్యకు గురైనట్లు గుర్తించారు. ఇందుకు కారణాలపై ఆరా తీశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పపత్రికి మృతదేహాన్ని తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని రహీద్ బంధువులు, కుటుంబసభ్యులు రెండో పట్టణ పోలీసు స్టేషన్ ఎదుట బుధవారం ఆందోళనకు దిగారు. హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కాగా, నలుగురిని నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

రవాణా ఖర్చులూ రావడం లేదు

- కర్నూలు కలెక్టర్‌తో ఉల్లి రైతులు

ప్రజాశక్తి - దేవనకొండ

ఉల్లి పంటకు కనీస మద్దతు ధర దక్కకపోవడంతో రైతులు జిల్లా కలెక్టరు ముందు తమ గోడు వెళ్లబోసుకున్నారు. మార్కెట్‌కు తీసుకొచ్చి అమ్ముకుందామంటే..అక్కడిచ్చే ధరతో కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని వాపోయారు. దీంతో ఊర్లోనే అందినకాడికి అమ్మేసుకుంటున్నామని వాపోయారు.

బుధవారం కర్నూలు జిల్లా దేవనకొండ మండలం ఈదులదేవరబండ గ్రామం శివారులో ఉల్లి రైతులతో కలెక్టర్ రంజిత్‌బాషా మాట్లాడారు. దీంతో వారు తమ ఇబ్బందులను ఆయనకు వివరించారు. ప్రభుత్వం ఇచ్చే ధర ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. మార్కెట్‌కు ఉల్లిని ఎలా తరలిస్తున్నారు? ఎలాంటి సమస్యలున్నాయని కలెక్టర్ ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లికి రూ.1200 మద్దతు ధర ఇస్తోందని ఆయన తెలిపారు. ఉల్లి ఉత్పత్తులను మార్కెట్‌కు తీసుకెళ్లాలని సూచించగా..ఆ ధరతో రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోయారు. దీంతో ఊర్లోనే రూ.800-రూ.850 చొప్పున అమ్మేసు కోవాల్సివస్తోందని పేర్కొన్నారు.

పాత స్టాక్‌కు కొత్త ధరలు

న్యూఢిల్లీ : జిఎస్‌టి శ్లాబులను తగ్గించనున్న నేపథ్యంలో ప్రస్తుత ఉత్పత్తుల స్టాక్‌పై గరిష్ట రిటైల్ ధర (ఎంఆర్‌పి)ని సవరించుకునే అవకాశాన్ని ఆయా కంపెనీలకు కల్పిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. దీంతో కొనుగోలుదారులు కొత్త స్టాక్ వచ్చేంత వరకు వేచి చూడకుండా, పాత స్టాక్‌ను మారిన ధరతో కొనుగోలు చేయడానికి వీలుంటుందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. జిఎస్‌టిని రేట్లను 5, 12 శాతాలకు కుదించిన విషయం తెలిసింది. ఇది ఈ నెల 22 నుంచి అమల్లోకి రానుంది.

19 నుంచి ఇన్‌స్టామార్ట్ క్విక్ ఇండియా సేల్

హైదరాబాద్ : క్విక్ కామర్స్ వేదిక ఇన్‌స్టామార్ట్ సెప్టెంబర్ 19 నుంచి ఇండియా మూవ్‌మెంట్ 2025ను ప్రారంభించనున్నట్లు తెలిపింది. ఈ సేల్‌ను 28 వరకు కొనసాగించనున్నట్లు పేర్కొంది. ఇందులో 50,000 పైగా ఉత్పత్తులపై 50-90 శాతం తగ్గింపును అందించనున్నట్లు వెల్లడించింది. 10 నిమిషాల్లో డెలివరీ చేయనున్నామని.. యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డ్‌లతో అదనంగా 10 శాతం డిస్కౌంట్‌ను అందించనున్నట్లు ఆ సంస్థ పేర్కొంది.



భారత్‌లోకి బివైడి ప్రవేశం..!

- త్వరలో ఆ కంపెనీ ప్రతినిధుల రాక

న్యూఢిల్లీ : చైనాకు చెందిన విద్యుత్ వాహనాల కంపెనీ బివైడి భారత్‌లో తన కార్యకలాపాల విస్తరణకు భారత ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేస్తోందని సమాచారం. ఈ నేపథ్యంలోనే త్వరలోనే బివైడి కంపెనీ ప్రతినిధులు భారత్‌ను సందర్శించనున్నారని ఈ వ్యవహారంతో సంబంధం కలిగిన వారు తెలిపారు. ఇటీవల ప్రధాన నరేంద్ర మోడీ చైనా ప్రెసిడెంట్ జిన్‌పిన్‌తో భేటీ అయిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం పెంపునకు సానుకూల చర్చలు జరిగాయి. ఇందులో బివైడి అంశం కూడా ఒక్కటని తెలుస్తోంది. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు, వాణిజ్య భాగస్వామ్యం, విస్తరణ అంశాలపై చర్చించడానికి బివైడి ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ కెట్సు జాంగ్ త్వరలో భారత్‌ను సందర్శించనున్నారు. ఆయనతో పాటు కంపెనీ సీనియర్ మేనేజర్లు, ఇంజనీర్ల కోసం వీసా ప్రక్రియ జరుగుతుందని సమాచారం. ఇంతక్రితం బివైడి ప్రవేశానికి మోకాలడ్డు వేసింది. అమెరికా కంపెనీ టెస్లాకు ఎర్రతివాచీ పరిచి.. బివైడిపైనా కేంద్ర మంత్రులు తీవ్రంగా విషం గక్కిన ఘటనలు ఉన్నాయి.

బిటెక్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



జగదీశ్వర్ రెడ్డి

తిరుపతిలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జగదీశ్వర్‌రెడ్డి నంద్యాల రైల్వే స్టేషన్‌లో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి దాదాపు ఒంటి గంట సమయంలో నంద్యాల రైల్వేస్టేషన్‌లోని 3వ కంపార్టుమెంట్ వద్ద గూడ్స్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ కుమారి తెలిపారు. ఎస్‌ఐ సమాచారం మేరకు... నంద్యాల జిల్లా మిడ్తూరు మండలం తత్తూరుకు చెందిన జగదీశ్వర్‌రెడ్డి తిరుపతిలోని విద్యానికేతన్ ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. కాలేజీ సెమిస్టర్ ఫీజు కోసం తల్లితండ్రులు పంపిన డబ్బులు స్నేహితునికి ఇచ్చినట్లు సమాచారం. సెమిస్టర్ ఫీజు సకాలంలో చెల్లించక పోవడంతో కాలేజీ యాజమాన్యం విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. డబ్బుల విషయం తల్లితండ్రులకు తెలియడంతో మనస్తాపానికి గురై విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

సంపాదకీయం

ఆందోళనకరం

రాష్ట్రంలో ప్రతి ఏటా ఆత్మహత్యలు పెరుగుతుండటం తీవ్ర ఆందోళనకరం. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశ వ్యాప్తంగా జరుగుతున్న బలవన్మరణాల్లో ఐదుశాతం ఆంధ్రప్రదేశ్ నుండే ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. 2014లో 6,101గా ఉన్న ఆత్మహత్యల సంఖ్య 2022 నాటికి 8,908కి పెరిగింది. 2014లో ప్రతి లక్షమంది జనాభాకు 12 ఆత్మహత్య రేటుగా ఉంటే 2022 లో అది 16.8కి పెరిగింది. విజయవాడలో ఒకే ఏడాదిలో 65 శాతం ఆత్యహత్యల పెరుగుదల నమోదు కాగా, విశాఖపట్నంలో 22 శాతం పెరుగుదల కనిపించింది. మరొక అధ్యయనం ప్రకారం ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలతో సమానంగా ఆత్మహత్యలు కూడా జరుగుతున్నాయి. సమైక్యరాష్ట్రవిభజన ముందునాటితో పోలిస్తే ఆ తరువాతే రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. 1996-2013మధ్య రోజుకి 20 మంది ఆత్మహత్యలు చేసుకోగా, విభజన తరువాత 2014-2021 మధ్య రోజుకి 41 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. పాలకులు చెప్పే మాటలు ఎలా ఉన్నప్పటికీ రాష్ట్రం ఏ దిశలో సాగుతుందో చెప్పడానికి ఈ గణాంకాలు ఒక నిదర్శనం. అధికారికంగా కుటుంబ సమస్యలు, వ్యాధులు, అప్పుల బాధలను ఆత్మహత్యలకు కారణాలుగా చెబుతున్నప్పటికీ అసలు కారణం ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలే అని చెప్పకతప్పదు. సరళీకరణ ఆర్థిక విధానాల్లో భాగంగా పాలకవర్గాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, కార్పొరేట్ అనుకూల విధానాలు ప్రజల మీద పెనుభారాన్ని మోపుతున్నాయి. దీంతో కుటుంబాలు తీవ్ర స్థాయిలో ఒత్తిడికి గురవుతున్నాయి.

ఆత్మహత్యలు చేసుకుంటున్న వారిలో దినసరి కూలీలు, రైతులు, నిరుద్యోగ యువత అధిక సంఖ్యలో ఉన్నారు. 2022లో నమోదైన గణాంకాల ప్రకారమే మొత్తం ఆత్మహత్యల్లో మూడో వంతు ఆత్మహత్యలు రోజువారీ కూలీలవే. ఇది వారి ఆర్థిక అస్థిరత, సామాజిక భద్రతా లోపానికి నిదర్శనం. ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించడంలో ప్రభుత్వాల వైఫల్యం యువతపై ప్రభావం చూపుతోంది. అన్నదాతల పరిస్థితి కూడా ఇంతే! పంటలకు గిట్టుబాటుధర లేక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు ప్రాణాలు తీసుకుంటున్నారు. వివిధ నివేదికల ప్రకారం 2014లో రాష్ట్రంలో 233 మంది రైతులు ఆత్యహత్యలు చేసుకోగా, 2022 నాటికి ఆ సంఖ్య 524కు చేరింది. ఒకవైపు అప్పులు తీర్చలేక రైతులు ప్రాణాలు తీసుకుంటుంటే, జీవనోపాధి లేక దినకూలీలు ఆత్మహత్యల బాట పడుతున్నారు. విద్యార్థులది మరో విషాద గాథ. 2022 సంవత్సరంలో 575 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకోవడం విద్యా వ్యవస్థలోని క్రూరత్వానికి నిదర్శనం. కార్పొరేట్ విద్యాసంస్థలు ర్యాంకుల కోసం విద్యార్థులపై అమానుష ఒత్తిడి పెడుతున్నాయి. విద్యార్థులలో తీవ్రస్థాయిలో అలజడి చెలరేగినప్పుడు కంటితుడుపు మాటలు చెబుతున్న నేతలు ఆ తరువాత వాటిని విస్మరిస్తుండటం దీనికి కారణం. మత్తు పదార్థాలకు బానిసలైన వారు చేసుకుంటున్న ఆత్మహత్యలు కూడా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తుంది. ఇక 2022లో చోటుచేసుకున్న మొత్తం 8,908 ఆత్మహత్యల్లో 2,141 మహిళలవే! ఈ పరిస్థితి దేనికి నిదర్శనమో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

ఆత్మహత్యలు వ్యక్తిగత బలహీనతలు కావు. వాటిని ప్రభుత్వాల విధానాలు, సమాజ బలహీనతల ఫలితంగానే చూడాలి! ఆత్మహత్యలకు పాల్పడిన కుటుంబాల పట్ల సానుభూతి చూపడం కన్నా ముందుగా ఆ పరిస్థితి రాకుండా చూడటం అవసరం. ప్రజల ప్రాణాలను కాపాడాలన్న చిత్తశుద్ధి నిజంగానే పాలకులకు ఉంటే ఆ దిశలో అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలి. ముందుగా మానసిక, ఆరోగ్య వసతులను బలోపేతం చేయాలి. హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేయడంతో పాటు, వాటిపై విస్తృత ప్రచారం చేయాలి. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సృష్టించాలి. రైతులకు రుణ విముక్తి, ఉపాధి హామీ పనులకు నిధుల పెంపు, కార్మికులకు భద్రత, విద్యార్థులకు ఒత్తిడి రహిత విద్య అందుబాటులోకి తేవాలి. నిజానికి ఇవన్నీ ప్రజల హక్కులే. వాటిని సాధించుకోవడం కోసం సమాజంలోని అందరూ కలిసి కదలాలి. ప్రభుత్వంపై ఒత్తిడితీసుకువచ్చి వాటిని సాధించాలి. లేనిపక్షంలో బలవన్మరణాల జాబితా మరింతగా పెరుగుతుంది!




ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక క్రమాన్ని శత్రువులు నేరాలతోను, బల ప్రయోగంతోను అణచివేయలేరు. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

- సాల్వడార్ అలెండీ,
అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు నేత.
జననం : 26.6.1908
మరణం : 11.9.1973

విశ్లేషణ

పడగ విప్పిన నిరంకుశత్వం





ప్రతిపక్షాన్ని, ప్రజాస్వామ్యాన్ని చెరబట్టి ఫక్తు నిరంకుశ పాలన కొనసాగించాలనే లక్ష్యంతో మోడీ ప్రభుత్వం ఈ బిల్లు తీసుకువచ్చింది. ఇది బిజెపి నయా ఫాసిస్టు పోకడలకు నిదర్శనం. నేరారోపణ రుజువయ్యే వరకు, అపరాధిగా నిర్ధారించే వరకు ప్రతి ముద్దాయి నిర్దోషే అని మన దేశ చట్ట, న్యాయ వ్యవస్థలు నిర్దేశించాయి. అర్థవంతమైన ఈ వ్యవస్థను కాలదన్ని, కేవలం అరెస్టయి, 30 రోజుల పాటు జైల్లో ఉన్నంతనే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులను పదవుల నుండి తొలగించడానికి ఉద్దేశించిన ఈ బిల్లు మన న్యాయ వ్యవస్థను అపహాస్యం పాల్జేస్తున్నది. ఈ బిల్లు కేంద్ర ఏజెన్సీలకు అపరిమితమైన ఏకపక్ష అధికారాలు కట్టబెట్టి, రాజకీయ ప్రత్యర్థులను రాజ్యాంగ బద్ధంగా వేధించడానికి ఉపకరిస్తుంది. ఇప్పటికే 'ఉపా' వంటి చట్టం ద్వారా నేరారోపణనే ఆయుధంగా మలుచుకుని వేలాది మందిని జైళ్ళ పాల్జేసిన నేపథ్యంలో... ఏమాత్రం రాజ్యాంగ బద్ధత లేని 130వ రాజ్యాంగ సవరణ బిల్లు చట్టంగా మారకుండా నిలవరించాలి.

ఆగస్టు 20న లోక్‌సభలో 130వ రాజ్యాంగ సవరణ బిల్లు ప్రవేశపెట్టారు. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్ము-కాశ్మీర్, పుదుచ్చేరిలకు కూడా వర్తించేలా చట్ట సవరణ బిల్లును కూడా ప్రవేశపెట్టారు. లోక్‌సభలో ప్రవేశ పెట్టిన అనంతరం ఈ బిల్లులను సంయుక్త పార్లమెంటరీ కమిటీకి నివేదించారు.

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే పార్లమెంటు ఉభయ సభలలోనూ మూడింట రెండు వంతుల మెజార్టీ అవసరం. ప్రస్తుతం బిజెపి కానీ, యన్‌డిఎ పక్షాలకు గానీ తగినంత సంఖ్యాబలం లేదు. ప్రస్తుత లోక్‌సభ సభ్యుల సంఖ్య 543. ఇందులో మూడింట రెండు వంతులు అంటే 362 ఓట్లు కావాలి. బిజెపి, దాని మిత్ర పక్షాలకు లోక్‌సభలో ఉన్న బలం 293 మంది పార్లమెంటు సభ్యులు. కాబట్టి రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలోనే గట్టెక్కే అవకాశం లేదు. అయినా మోడీ ప్రభుత్వం ఈ బిల్లులు ప్రవేశపెట్టింది.

బిజెపి ఊరూవాడా ప్రచారం చేసి 'ఒకే దేశం-ఒకే ఎన్నిక'కు సంబంధించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కూడా గతంలో మోడీ ప్రభుత్వం ఇలానే హడావుడిగా లోక్‌సభలో ప్రవేశ పెట్టినప్పుడే పాలక పక్షానికి తగినంత సంఖ్యాబలం లేదన్న అంశాన్ని ఎత్తి చూపడం జరిగింది. అయితే లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టడానికి సాధారణ మెజారిటీ సరిపోతుంది. ఈ బిల్లుకు అనుకూలంగా 263 మంది పార్లమెంట్ సభ్యులు, వ్యతిరేకంగా 198 మంది సభ్యులు ఓటు చేసిన మూలంగా బిల్లునయితే ప్రవేశ పెట్టారు కానీ ఈ బిల్లు ఆమోదం పొందడానికి నాడు పార్లమెంట్‌కు హాజరైన 461 మంది సభ్యులలో 301 మంది మద్దతు అవసరం. తగిన సంఖ్యా బలం లేని కారణంగా ఆ బిల్లుకు చట్టసభల ఆమోదం లభించలేదు.



ఎం.ఎ. బేబి

వాస్తవానికి మోడీ ప్రభుత్వం తాజాగా ప్రవేశ పెట్టిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లును ప్రజాప్రయోజనార్థం, వారి సంక్షేమం కోసం, సుపరిపాలన అందించే ఉద్దేశంతో తీసుకువచ్చాం అని చెబుతుంది. కానీ ఈ బిల్లును అడ్డు పెట్టుకుని ప్రతిపక్ష పార్టీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిరపరిచే, భారత రాజ్యాంగం లోని 'సమాఖ్యతత్వాన్ని' నీరుగార్చే దుర్మార్గపు తలంపుతో క్రూరమైన చట్టాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తున్నది. వేధింపు రాజకీయాలకు చిరునామాగా మారిన మోడీ ప్రభుత్వం ఈ బిల్లులోని అంశాలను స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేసేందుకు ఏ మాత్రం వెనుకాడదు. 'రాజ్యాంగ నైతికత'ను ఉదహరిస్తున్న ఈ బిల్లు...కోర్టులు ముద్దాయిగా నిర్ధారించి శిక్ష విధిస్తే తప్ప అనర్హత వేటు వెయ్యడానికి వీలులేదన్న రాజ్యాంగ సూత్రాలనే ఉల్లంఘిస్తుంది. కేవలం అభియోగాలు మోపడం, అరెస్టు చేయడంతోనే ఎవరినీ దోషులుగా నిర్ధారించలేం. ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951, 8వ సెక్షన్‌లో ఈ అంశం స్పష్టంగా పొందుపరచబడి ఉన్నది. ఇవాళ దేశంలో నెలకొని ఉన్న హానికర రాజకీయ వాతావరణ నేపథ్యంలో మోడీ ప్రభుత్వం తమకు గిట్టని వ్యక్తులు ఎవరి మీదయినా కల్పిత అభియోగాలు మోపి, అరెస్టు చేయించి, దీర్ఘకాలం పాటు జైల్లో మగ్గిపోయేలా చెయ్యడం మనం చూస్తూనే ఉన్నాం. కాబట్టి ఈ బిల్లుని ఆయుధంగా వాడుకుని రాజకీయ ప్రత్యర్థులను దెబ్బ తీయడానికి, ప్రజాస్వామిక సూత్రాలను నీరుగార్చడానికి ఈ ప్రభుత్వం వెనుకాడదు.

భారత రాజ్యాంగంలోని అధికరణం 75, 164, 239 ఎ.ఎ లను అనుసరించి పదవిలో ఉన్న మంత్రులను ఎవరినైనా తొలగించాలంటే పాటించాల్సిన విధివిధానాలు స్పష్టంగా పొందుపరచబడి ఉన్నాయి. రాష్ట్రపతి సలహా మేరకు ముఖ్యమంత్రికి అలా తొలగించే అధికారాలు ఉన్నాయి.

ఈ కారణం వల్లనే ప్రస్తుతం మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమైనది. రాజ్యాంగంలోని 14, 19, 21 అధికరణాల ప్రకారం చట్టం ముందు అందరూ సమానులే. అంతేగాక ఇవి వాక్‌స్వాతంత్ర్యం, చట్ట బద్ధమైన చర్యలు, వ్యక్తి స్వేచ్ఛలకు అవకాశం కల్పిస్తున్నాయి. రుజువుకాని నేరాభియోగాల సాకున ఎవరినైనా పదవి నుండి తొలగించే అధికారం చేజిక్కించుకోవడం అంటే రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాయడమే. నిర్దోషిత్వాన్ని నిరూపించుకునే భారాన్ని ముద్దాయిల మీద మోపడమే. తాజాగా ప్రవేశపెట్టిన బిల్లులో ఈ అధికారాలను సమీక్షించేందుకు తగిన క్లాజు కూడా పొందుపరచలేదు. ఒకసారి పదవి నుండి తొలగించబడిన మంత్రిని కోర్టు నిర్దోషిగా విడుదల చేసినా లేక 30 రోజుల అనంతరం బెయిల్ మీద విడుదల అయినా తిరిగి సదరు వ్యక్తి మంత్రిగా బాధ్యతలు చేపట్టలేడు. చేసింది అక్రమ అరెస్టు అని కోర్టులో తేలితే పరిహారం చెల్లింపునకూ తగిన క్లాజులు ఈ బిల్లులో లేవు. ఒక రకంగా చెప్పాలంటే 'ఉపా' చట్టాన్ని అడ్డం పెట్టుకుని అసమ్మతి స్వరాలను అక్రమంగా ఎలా జైళ్ళలో మగ్గేలా చేస్తున్నారో ఈ బిల్లు చట్ట రూపం దాలిస్తే జరిగేది కూడా ఆ తంతే.

కేంద్ర విభాగాల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అయితే మోడీ ప్రభుత్వానికి పెంపుడు కుక్కలా పనిచేస్తుంది. గత కొన్నేళ్ళలో ఇ.డి దాదాపు 5000 కేసులు మోపితే కేవలం 38 కేసులలో మాత్రమే శిక్షలు పడ్డాయంటే ఈ సంస్థ పని తీరు ఎంత నాసిరకంగా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. వందలాది కేసులు ఇప్పటి వరకూ అసలు విచారణకే నోచుకోలేదు. 2014 నుండి 2022 మధ్య ఉన్న ఎనిమిదేళ్ళ కాలంలో ఇ.డి చేపట్టిన కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష రాజకీయ నాయకుల మీద మోపినవే. ఈ చట్టంలోని సెక్షన్ 45 లోని రెండు షరతుల మేరకు 'మనీ లాండరింగ్' కేసుల్లో బెయిల్ రావడం కనాకష్టం. 30 రోజుల తర్వాత జుడిషియల్ కస్టడీని పొడిగించడానికి అవకాశం లేనందున 29 రోజులు గడిచాక ఈ ఏజన్సీ తిరిగి అరెస్టు చేసినట్లు చూపిస్తున్న ఉదంతాలూ వెలుగులోకి వస్తున్నాయి. అభియోగాలు మోపకుండా దీర్ఘకాలం పాటు జైల్లో ఉంచేందుకు, అరెస్టయిన వ్యక్తికి బెయిల్ రాకుండా చూసేందుకు ఇ.డి ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్నది. మోడీ ప్రవేశపెట్టిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు చట్ట రూపం దాల్చితే అక్రమాలు మరింత పెచ్చరిల్లుతాయి.

ఈ బిల్లుకు వ్యతిరేకంగా నాలుగు ప్రధాన అభ్యంతరాలు లేవనెత్తాల్సిన అవసరముంది.

మొదటిది-ఇది నిర్దోషి అన్న అంచనాను అతిక్రమిస్తుంది. న్యాయస్థానాలు దోషిగా నిర్ధారించే వరకు ముద్దాయిలు నిర్దోషులే అన్న రాజ్యాంగ హామీని తుంగలో తొక్కి, మంత్రులు అరెస్టయితే చాలు పదవి నుండి తొలగించడం అనేది వేధింపులకు తగిన కార్యనిర్వాహక సాధనంగా మారుతుంది.

రెండవది- ఈ బిల్లు అధికార విభజన సూత్రాలను ఉల్లంఘించడమే. అరెస్టయి, నెల రోజులు జైల్లో ఉన్న మంత్రులను తొలగించడం అంటే పార్లమెంటు రూపొందించిన ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని, న్యాయ ప్రక్రియను- రెండింటినీ ఉపేక్షించడమే. రాజ్యాంగం పొందు పరిచిన 'నియంత్రణలు, సమతుల్యతలను' త్రోసిరాజని కార్యనిర్వాహక శాఖ అడ్డూ అదుపు లేని అధికారాలను కైవసం చేసుకోవడమే.

మూడవది- చట్ట పరంగా అవసరమైన ప్రక్రియను ఈ బిల్లు నిరాకరిస్తుంది. నేరారోపణ, న్యాయ విచారణ, న్యాయస్థానాల తీర్పు-ఈ ప్రక్రియతో సంబంధం లేకుండా కేవలం అభియోగాలు, అరెస్టుల ఆధారంగా మంత్రులను తొలగించడం చట్టవ్యతిరేకం.

నాల్గవది- ఈ బిల్లు రాజకీయ దుర్వినియోగానికి సాధనంగా మారుతుంది. సుపరిపాలన అందించడానికి బదులుగా ప్రతీకార రాజకీయాలకు, వేధింపు రాజకీయాలకు చట్టబద్ధత కల్పిస్తుంది.

ఈ ప్రతిపాదిత బిల్లు మన దేశ రాజ్యాంగ మౌలిక నిర్మాణం మీద ఎక్కుపెట్టిన దాడి. ఈ బిల్లును ప్రతిపక్షాలతో పాటు, ఈ దేశాన్ని హిందూత్వ రాజ్యంగా మలచాలన్న ఆర్.ఎస్.ఎస్ దీర్ఘకాలిక ఎజెండా పట్ల సుముఖత ఉన్నవారు కూడా వ్యతిరేకిస్తున్నారు. నాజీ జర్మనీలో హిట్లర్ రూపొందించిన చట్టాలకు, మన దేశంలో మోడీ తీసుకువస్తున్న చట్టాలకు మధ్య ఉన్న సామ్యం గురించి అనేకమంది హెచ్చరిస్తున్నారు.

తాజాగా ప్రతిపాదిస్తున్న రాజ్యాంగ సవరణలు, వీటికి కొద్దిగా ముందు ప్రవేశ పెట్టిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' బిల్లు దేశంలో పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని దుంపనాశనం చేసి హిందుత్వ బ్రిగేడ్ కోరుకునే అధ్యక్ష తరహా పాలనను ఆవిష్కరించడానికి ఉద్దేశించినవి. కాషాయ పరివారానికి ప్రజాస్వామ్యం పొడ గిట్టదు. దేశ పౌరులను తమతో సరిసమానంగా భావించి ప్రజాస్వామికంగా ప్రభుత్వాన్ని నడపడం కన్నా, ప్రజలను శాసించి వారు ప్రభుత్వానికి లొంగి ఉండేలా పాలించాలనే బాపతు ఇది.

ప్రతిపక్షాన్ని, ప్రజాస్వామ్యాన్ని చెరబట్టి ఫక్తు నిరంకుశ పాలన కొనసాగించాలనే లక్ష్యంతో మోడీ ప్రభుత్వం ఈ బిల్లు తీసుకువచ్చింది. ఇది బిజెపి నయా ఫాసిస్టు పోకడలకు నిదర్శనం. నేరారోపణ రుజువయ్యే వరకు, అపరాధిగా నిర్ధారించే వరకు ప్రతి ముద్దాయి నిర్దోషే అని మన దేశ చట్ట, న్యాయ వ్యవస్థలు నిర్దేశించాయి. అర్థవంతమైన ఈ వ్యవస్థను కాలదన్ని కేవలం అరెస్టయి, 30 రోజుల పాటు జైల్లో ఉన్నంతనే ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి, మంత్రులను పదవుల నుండి తొలగించడానికి ఉద్దేశించిన ఈ బిల్లు మన న్యాయ వ్యవస్థను అపహాస్యం పాల్జేస్తున్నది. ఈ బిల్లు కేంద్ర ఏజెన్సీలకు అపరిమితమైన ఏకపక్ష అధికారాలు కట్టబెట్టి, రాజకీయ ప్రత్యర్థులను రాజ్యాంగ బద్ధంగా వేధించడానికి ఉపకరిస్తుంది. ఇప్పటికే 'ఉపా' వంటి చట్టం ద్వారా నేరారోపణనే ఆయుధంగా మలుచుకుని వేలాది మందిని జైళ్ళ పాల్జేసిన నేపథ్యంలో ఏమాత్రం రాజ్యాంగ బద్ధత లేని 130వ రాజ్యాంగ సవరణ బిల్లు చట్టంగా మారకుండా నిలవరించాలి.

లోక్‌సభలోగానీ రాజ్యసభలోగానీ బిజెపికి కనీస సాధారణ మెజార్టీ కూడా లేదు. ఈ రెండు చట్ట సభలలో బిజెపి సంఖ్యాబలం కేవలం 240, 102 మాత్రమే. ఇది ఆ యా సభల సంఖ్యా బలంలో సగానికన్నా తక్కువ. సాధారణ బిల్లులు ఆమోదం పొందాలన్నా మోడీ ప్రభుత్వం తెలుగు దేశం, జనతాదళ్ (యునైటెడ్), లోక్ జనశక్తి, శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్, రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీల మద్దతు మీద ఆధార పడాల్సిందే. చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్న 2014-19 మధ్య కాలంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో కుంభకోణం జరిగిందన్న అభియోగం మీద...ఎ.పి శాసనసభ ప్రతిపక్ష నాయకుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడైన ఆయన్ని 52 రోజులపాటు జైల్లో వుంచారు.

సంఖ్యాపరంగా బిజెపితో పోలిస్తే చిన్న పార్టీ అయినప్పటికీ తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు వంటి నాయకులు తలుచుకుంటే ఎన్డీయే కూటమిని నిలబెట్టగలరు, పడగొట్టనూగలరు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లు వీరి పట్ల కూడా ప్రమాదకరంగా పరిణమించగలదు. హిందుత్వ ప్రాజెక్టుకు ఆటంకంగా నిలవనంత వరకూ చంద్రబాబును ఉపేక్షించవచ్చు. కానీ మోడీ ప్రభుత్వం తీసుకు వచ్చిన ఈ బిల్లు ఎన్డియే భాగస్వామ్య పక్షాలకు ఒక హెచ్చరికే. బిజెపి కి ఎదురు తిరిగినా, వ్యతిరేకించినా 'తగిన శాస్తి' జరుగుతుందని మోడీ ప్రభుత్వం ఈ బిల్లు ద్వారా తన మిత్రపక్షాలను కట్టడి చేయడానికి చూస్తున్నది.

బిజెపి కి తగినంత సంఖ్యాబలం లేనప్పటికీ మన దేశ రాజ్యాంగాన్ని తిరగరాయడానికి శతథా ప్రయత్నిస్తూనే వున్నది. ఇది ఆ పార్టీలో ఉన్న నిరంకుశ ధోరణికి నిదర్శనం. కేంద్ర ఏజెన్సీలు ఇప్పటికే ప్రతిపక్ష రాజకీయ నేతల మీద తప్పుడు కేసులు బనాయించి తీవ్ర వేధింపులకు పాల్పడుతున్నాయి. ప్రస్తుతం ప్రతిపాదించిన 130వ రాజ్యాంగ సవరణ బిల్లు అలాంటి అక్రమాలకు చట్టబద్ధత కల్పిస్తుంది. అందుకే ఆరు నూరైనా ఈ బిల్లును ప్రతిఘటించి తీరాలి.

(వ్యాసకర్త సి.పి.యం ప్రధాన కార్యదర్శి)


వ్యాసం

విశాఖ స్టీల్‌కు క్యాప్టివ్ మైన్స్ ఎందుకు లేవు?



విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వారికి అమ్మాలనే విధానంతో నాటి నుండి నేటి వరకు సొంత గనులు సమకూర్చకుండా నిర్లక్ష్యం చేశాయి. 2014 నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి బంగారు బాతు లాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తమకు అనుకూలమైన కార్పొరేట్లకు కట్టబెట్టడానికి వడివడిగా ప్రయత్నిస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు త్యాగ గుణంతో రైతులు ఇచ్చిన 20 వేల ఎకరాల భూములు జాతీయ రహదారి పక్కనే ఉన్నాయి. దేశంలోని సముద్ర తీరంలో ఉన్న ఏకైక స్టీల్‌ప్లాంట్ విశాఖ స్టీల్‌ప్లాంట్. ఆధునికమైన యంత్రాలున్నాయి. నైపుణ్యం కలిగిన కార్మికవర్గం అత్యంత నాణ్యమైన స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అందుకే కార్పొరేట్ల కళ్లు ఇతర ఏ ఇతర స్టీల్‌ప్లాంట్ల మీద లేవు. ఒక్క విశాఖ స్టీల్ మీదే ఉన్నాయి.

దేశంలోని అన్ని ప్రభుత్వ రంగ స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులున్నాయి. టాటా కంపెనీతో సహా అనేక ప్రైవేట్ స్టీల్‌ప్లాంట్లకు వంద సంవత్సరాలకు సరిపడా ఇనుప ఖనిజ గనులున్నాయి. కానీ ఒక్క విశాఖస్టీల్ ప్లాంట్‌కే గత 40 సంవత్సరాల నుండి ఉత్పత్తి జరుగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సొంత గనులు కేటాయించలేదు. ఒక టన్ను స్టీల్ తయారు చేయడానికి 1.6 టన్నుల ఇనుప ఖనిజం ఉండాలి. 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సాలీనా 10 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజం అవసరం. సొంత గనులున్న స్టీల్ ప్లాంట్లు తమ గనుల నుండి తవ్వి తీసుకోవడానికి టన్నుకు సుమారు రూ.1000 లోపే అవుతుంది. కాని విశాఖ స్టీల్‌ప్లాంట్ మార్కెట్‌లో కొనడం వల్ల టన్ను రూ.8 వేలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. దీని వల్ల సాలీనా సుమారు రూ.4 వేల కోట్లకు పైగా అదనంగా విశాఖ స్టీల్‌పై భారం పడుతున్నది. ఇంత తీవ్రమైన సమస్యను గత 40 సంవత్సరాల నుండి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించలేదు. 1990లో విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించింది. అదే కాలంలో సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలు భారతదేశంలో అమల్లోకి వచ్చాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వారికి అమ్మాలనే విధానంతో నాటి నుండి నేటి వరకు సొంత గనులు సమకూర్చకుండా నిర్లక్ష్యం చేశాయి. 2014 నుండి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి బంగారు బాతు లాంటి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను తమకు అనుకూలమైన కార్పొరేట్లకు కట్టబెట్టడానికి వడివడిగా ప్రయత్నిస్తోంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు త్యాగ గుణంతో రైతులు ఇచ్చిన 20 వేల ఎకరాల భూములు జాతీయ రహదారి పక్కనే ఉన్నాయి. దేశంలోని సముద్ర తీరంలో ఉన్న ఏకైక స్టీల్‌ప్లాంట్ విశాఖ స్టీల్‌ప్లాంట్. ఆధునికమైన యంత్రాలున్నాయి. నైపుణ్యం కలిగిన కార్మికవర్గం అత్యంత నాణ్యమైన స్టీల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అందుకే కార్పొరేట్ల కళ్లు ఇతర ఏ ఇతర స్టీల్‌ప్లాంట్ల మీద లేవు. ఒక్క విశాఖ స్టీల్ మీదే ఉన్నాయి.



సిహెచ్. నరసింగరావు

విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నాయకులు స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వాలని గట్టిగా మాట్లాడటం, అధికారంలోకొచ్చిన తర్వాత ఓడ దాటిన తర్వాత బోడి మల్లన్న అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. 2009లో ఫిబ్రవరి 19 విశాఖ స్టీల్ యూనియన్లు ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద సొంత గనులు కోసం ధర్నా నిర్వహించారు. ఆనాడు ప్రతిపక్షంలోని చంద్రబాబు ఏ మాట్లాడారో చూద్దాం. "ఇది మేము పోరాడి సాధించిన ప్రాజెక్టు, మీరు అమ్మడానికి వీల్లేదు. ఇది పబ్లిక్ సెక్టార్‌లోనే ఉండాలి" అని గట్టిగా పోరాడాం. బిఐఎఫ్ఆర్ కు పోకుండా ఆపాము. మంచి లాభాలు సాధించింది. 4 మిలియన్ టన్నుల నుంచి 7.3 మిలియన్ టన్నులకు విస్తరణ జరిగింది. ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి విశాఖ స్టీల్‌ప్లాంట్ ఓబులాపురం మైన్స్ ఇచ్చి ఉంటే విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఏ సమస్య ఉండేది కాదు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం ఎస్సార్, జిందాల్, పోస్కో, బ్రాహ్మణి స్టీల్ ప్లాంట్‌లకు మైన్స్ కట్టబెట్టారు. కాని వారికి విశాఖ స్టీల్‌ప్లాంట్ జ్ఞాపకం రాలేదు. వారంతా డబ్బులిస్తారు. మనం ఇక్కడ డబ్బులు ఇవ్వలేము. కాబట్టే మైన్స్ ఇవ్వడం లేదు. ఎంత బాధాకరమో చూడండి తమ్ముళ్లూ" అని ఆయన బాధను వాపోయారు. ఇదే విధంగా అనేక సార్లు ఆనాటి అధికార పక్షాన్ని విమర్శిస్తూ విశాఖ స్టీల్‌ప్లాంట్ కోసం చంద్రబాబు మొసలి కన్నీరు కార్చారు. కాని, నేడు ఆర్సెలార్ మిట్టల్‌కు గనులు అడుగుతున్న చంద్రబాబు విశాఖ స్టీల్ ప్లాంట్‌కు మాత్రం మైన్స్ అడగడంలేదు. ఈనాడు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మరియు కేంద్ర ఎన్‌డిఏ ప్రభుత్వంలో భాగస్వాములుగా ఉన్న బిజెపి, తెలుగుదేశం, జనసేన పార్టీలు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనుల మాట మాట్లాడకుండా అక్కడ పోరాడుతున్న ట్రేడ్ యూనియన్లపై దుమ్మెత్తిపోస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకాశం జిల్లాలోని 66 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని జిందాల్ కంపెనీకి కేటాయించింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ దరఖాస్తు చేసినా ప్రకాశం జిల్లాలోని కొణిజెడు, మర్లపాడు గ్రామాల్లోని 1307 ఎకరాల్లోని ఇనుప ఖనిజాన్ని విశాఖ స్టీల్‌కు కేటాయించలేదు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇదే గనులను జింపెక్స్ కంపెనీకి కేటాయించింది. ఆ కంపెనీ ఒక్క టన్ను కూడా తీయకుండా వెళ్లిపోయింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఇనుప ఖనిజం కోసం దరఖాస్తు చేసినా కేంద్రం, రాష్ట్రం రెండూ గనులు కేటాయించడం లేదు. సొంత గనులు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సమకూర్చితే విశాఖ స్టీల్ దేశంలోనే ఉత్పత్తిలోనూ, లాభాల్లోనూ ప్రథమ స్థానంలో ఉంటుంది. ప్రభుత్వ రంగంలో ఉన్నంత కాలం కేటాయించకుండా ఈ పరిశ్రమను నష్టాల్లోకి నెట్టి సిక్ పరిశ్రమగా ప్రకటించి ప్రైవేట్‌కు కట్టబెట్టాలనే దుర్మార్గమైన విధానాన్ని కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్నది.

ఇటీవల కాలంలో స్టీల్‌శాఖ మంత్రిగా ఉన్న శ్రీనివాస వర్మ విశాఖ స్టీల్ సొంత గనులపై వితండవాదం చేశారు. దేశంలో సొంత గనులు లేని పెద్ద పెద్ద కంపెనీలకు కూడా లాభాలు వస్తున్నాయని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కూడా గతంలో లాభాలు వచ్చాయని చెప్పడం వింతగా ఉంది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకున్నా 2000 సంవత్సరం వరకు ఇనుప ఖనిజం టన్ను రేటు రూ.500 లోపే ఉండేది. 2000 సంవత్సరం తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో అనేక మార్పులు వచ్చాయి. దాని ప్రభావంతో టన్ను ధర రూ. 8 వేలు పైగా పెరిగింది. మన దేశంలో మైన్స్ అండ్ మినరల్స్ డెవలప్‌మెంట్ మరియు రెగ్యులేషన్ చట్టం 1957, సెక్షన్ 17ఎ ప్రకారం అన్ని ప్రభుత్వరంగ పరిశ్రమలకు కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించాలి. అందువల్లనే మన దేశంలోని భిలాయ్, బొకారో, దుర్గాపూర్, రూర్కెలా లాంటి ప్రభుత్వ రంగ భారీ పరిశ్రమలన్నింటికీ సొంత గనులు ప్రారంభం నుండే కేంద్ర ప్రభుత్వాలు కేటాయించాయి. ఆంధ్రప్రదేశ్ నుండి ఎన్నికైన స్టీల్ శాఖామంత్రి ఈ విషయం గురించి అడగడం చేతకాక వక్రవాదనలు చేయడం విడ్డూరంగా ఉంది. పవన్ కల్యాణ్ ఎన్నికల ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్ దగ్గర భారీ బహిరంగ సభ నిర్వహించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు అడిగే ధైర్యం, దమ్ము ఆనాటి వైసిపి ప్రభుత్వానికి లేదని బల్ల గుద్ది విమర్శించారు. ఆనాటి ఎంపీలను ఉప్పు, కారం తిన్నారా? అని ప్రశ్నించారు. కాని ఈనాడు ఆయన ఉక్కు గనుల ఊసే మాట్లాడటం లేదు. అలాగే విశాఖ ఎంపీ శ్రీభరత్ కూడా మైన్స్ గురించి వక్రభాష్యాలు చెబుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఉన్నాయని అబద్ధాలాడుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) 2012లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని రిట్ పిటిషన్ దాఖలు చేసింది. జస్టిస్ నర్సింహారెడ్డి విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. కానీ ఆ తీర్పు నేటికీ అమలుకు నోచుకోలేదు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ప్రకాశం జిల్లాలో సొంత గనుల కోసం అనేక దఫాలుగా దరఖాస్తు చేసినా రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేట్ వారికి అమ్ముకుని తన విధానాన్ని 2016 నుంచి అమల్లోకి తెచ్చింది. ప్రభుత్వ రంగ పరిశ్రమలకు కేటాయించాలనే చట్టం స్పష్టంగా ఉన్నా కేంద్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ప్రత్యేకంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కావాలనే సొంత గనులు కేటాయించలేదు. రాష్ట్రంలోని తెలుగుదేశం, జనసేన కూటమి ప్రభుత్వాలకు నేడున్న అవకాశాలు గతంలో ఏనాడూ లేవు. కూటమి ప్రభుత్వం మద్దతు లేకుండా కేంద్ర బిజెపి ప్రభుత్వం ఒక్క రోజు కూడా కొనసాగలేదు. కూటమి ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించమని కేంద్ర బిజెపి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తే ఖచ్చితంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు వస్తాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అన్ని సమస్యలూ పరిష్కారమవుతాయి. టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం తమ చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలి.

/ వ్యాసకర్త విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ /

జనవాక్యం

'సహ' చట్టాన్ని నీరుగారుస్తున్నారు

ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కార్యాలయం వారికి సమాచార హక్కు చట్టం పట్టదా లేక తెలియదా! ముఖ్యమంత్రి చంద్రబాబు గారు రోజుకు 18 గంటలు పని చేస్తున్నాను అంటున్నారు. సంతోషం. కింది అధికారుల మాటేమిటి? సమాచార హక్కు చట్టం కింద గత నెల 27వ తేదీన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శిని సాయిబాబా శతజయంతికి సంబంధించి కొంత సమాచారం కోరాము. చట్టం ప్రకారం నాకు 30 రోజులలోపు సమాధానం రావాలి. అయితే నా లేఖను జనరల్ అడ్మినిస్ట్రేటివ్ డిపార్టుమెంటుకి పంపి, వారిని సమాధానం ఇవ్వమని రాశారు. ఎవరు ఎవరికి పంపినా 30 రోజుల లోపు సమాధానం ఇవ్వవలసిన బాధ్యత అధికారులపై ఉంది. కాని సమాధానం రాలేదు. ఒక ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కార్యాలయం వారే ఇలా ఉంటే, ఇక చిన్న చిన్న కార్యాలయాలవారు ఎలా ఉంటారో? ముఖ్యమంత్రి గారేమో పాలనా దక్షత రక్షణ కావాలంటున్నారు. అధికారుల తీరు ఇలా ఉంది. అంతేకాదు సమాచార హక్కు చట్టం కింద సమాచారం ఇచ్చేటప్పుడు, సరైన సమాచారం కాదనుకున్నపుడు అప్పిలేట్ అధికారికి రాయండి అని అప్పిలేట్ అధికారి అడ్రస్ రాయాలి. మరి ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కార్యాలయం నుండి వచ్చే లేఖలో వారు ఆ విషయం మరిచారు. మరిప్పుడు నేను ఏ అప్పిలేట్ అధికారికి రాయాలి? ఇంత బాధ్యతా రాహిత్యం అయితే ఎలా! సమాచార హక్కు చట్టాన్ని నీరుగార్చటం అంటే ఇదే !!

- నార్నె వెంకట సుబ్బయ్య

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

గాజా సహాయ ఫ్లోటిల్లా బోట్లపై ఇజ్రాయిల్ దాడి

ట్యూనిస్ : గాజాకు మానవతా సాయం అందించేందుకు వెళ్తున్న బోట్లపై బుధవారం ఇజ్రాయిల్ డ్రోన్‌లు దాడులు జరిపాయి. ట్యునీషియా తీరంలో బోట్లపై దాడి జరిగిందని ఫ్లోటిల్లా కార్యకర్తలు తెలిపారు. అయితే ప్రాణనష్టం జరగలేదని, బోట్లు స్వల్పంగా దెబ్బతిన్నాయని, మంగళవారం కూడా ఫ్రాన్స్‌కు చెందిన బోట్‌పై దాడి జరిగిందని వారు పేర్కొన్నారు. దీనిపై ఇజ్రాయిల్ స్పందించలేదు. గాజాపై ఇజ్రాయిల్ చేస్తున్న దారుణాలపై అంతర్జాతీయంగా సంఘీభావం వెల్లువెత్తింది. దీనిలో భాగంగా గాజాలో చిన్న పిల్లలకు ఆహారం, వారికి సహాయ సామాగ్రిని అందించేందుకు సెప్టెంబర్ 1వ తేదీన బార్సిలోనా నుండి దాదాపు 42 దేశాల నుండి 70 పైగా బోట్లతో స్వీడన్ పర్యావరణ ఉద్యమకారిణి గ్రేటా దన్‌బర్గ్‌తో పాటు వందలాది మంది కార్యకర్తలు గాజాకు వెళ్తున్న సంగతి తెలిసిందే. అయితే దీన్ని సహించని నెత న్యాహు ప్రభుత్వం అడ్డుకునే ప్రయత్నం చేస్తుంది. గతంలో జరిగిన దాడి సందర్భంగా ఫ్లోటిల్లా సహాయం పబ్లిసిటీ స్టంట్‌గా పేర్కొంది. వారు ఆయుధాలు స్మగ్లింగ్ చేస్తున్నారని విమర్శించింది. గాజాపై ఇజ్రాయిల్ దాడులు తీవ్రంతరం చేసిన అనంతరం మాపై దాడులు చేస్తుందని, ఏం జరిగినా మా లక్ష్యాన్ని చేరుకుంటామని వారు ప్రకటించారు.

నేపాల్‌లో చిక్కుకున్న రాష్ట్రవాసులు

- వారిని సురక్షితంగా రప్పించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు
- బాధితులతో మాట్లాడిన అధికారులు
- నేడు వచ్చే అవకాశం


నేపాల్‌లో చిక్కుకుపోయిన విజయనగరం, పార్వతీపురం మన్యం వాసులు

ప్రజాశక్తి- యంత్రాంగం

మన రాష్ట్రానికి చెందిన పలువురు నేపాల్‌లో చిక్కుకుపోవడంతో వారి కుటుంబీకులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ వారిని కాపాడాలని, సురక్షితంగా దేశానికి తీసుకురావాలని వేడుకుంటున్నారు. సహాయం కోసం బాధితులు ఎదురు చూస్తున్నారు. వారంతా అక్కడి హోటళ్లలో తలదాచుకుంటున్నారు. నేపాల్‌లో చెలరేగిన అసంతృప్తుల నేపథ్యంలో ఆదేశంలో ప్రస్తుత అల్లకల్లోలం నెలకొన్న సంగతి తెలిసిందే. దీనికి ముందు ఉత్తరాంధ్ర, గుంటూరు జిల్లాలకు చెందిన పలువురు నేపాల్ వెళ్లారు. ప్రస్తుత అక్కడ కర్ఫ్యూ అమలవుతుండడంతో వారంతా అక్కడే చిక్కుకుపోయారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి 61 మంది వారిలో ఉన్నారు. వీరంతా మానససరోవరం సందర్శనకు వెళ్లారు. వారిలో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన పొట్నూరు శ్రీనివాసరావు, పొట్నూరు సంగీత, గులిపల్లి శారద, విజయనగరం జిల్లాకు చెందిన ఎల్.మురళీకృష్ణ, ఎల్.శారద, బి.కామేశ్వరరావు, బివిఎస్ మాలతి, డి.మురళి, డి.రేణుక, శివప్రసాద్ మహాపాత్ర్, ప్రదీప్ మహాపాత్ర, ఎద్దు సుబ్బారావు, ఆర్‌జి రెడ్డి, కెవిస్ రావు, ఎం.రాజు, ఎం.శేఖర్, కె.పద్మ, ఎస్‌వి రమణ, ఎస్.రమ, ఆర్‌వి, ఆర్ఎస్ రావు, బివిస్ రావు, బి.శారద, వి.లక్ష్మి, గాజులరేగకు చెందిన పి.సూర్యకుమారి, ఎ.లలిత, ఓ.బంగారురాజు, సూర్యకళ, కె.ఈశ్వర్, కెవిరావు, కె.రామయమ్మ తదితరులు ఉన్నారు. విశాఖకు చెందిన పది మంది, గుంటూరు జిల్లాకు చెందిన ఎనిమిది మంది కూడా నేపాల్‌లో చిక్కుకున్నారు. వారిలో కొందరు కుటుంబసభ్యులకు ఫోన్ చేసి అక్కడి తమ పరిస్థితిని వివరించారు. ఆడియో, వీడియో సందేశాలు పంపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. అక్కడ చిక్కుకున్న వారిని క్షేమంగా తీసుకొచ్చేందుకు చర్యలు ప్రారంభించింది. దీనిపై మంత్రి లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా జిల్లాల కలెక్టరేట్లలో అత్యవసర హెల్ప్ నంబర్లను ఏర్పాటుచేయాలి. నేపాల్‌లోని ఓ హోటల్లో తలదాచుకుంటున్న వారిని విజయనగరం కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫోన్ ద్వారా పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని, సురక్షితంగా రప్పించేందుకు ప్రయాణ ఏర్పాట్లు చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. అక్కడి హోటల్ రాయల్ ఖాన్‌లో విడిది చేసిన గోవింద్ అనే విజయనగరం జిల్లా గాజులరేగకు చెందిన వ్యక్తితో కలెక్టర్ ఫోన్ ద్వారా మాట్లాడారు. ఢిల్లీలోని ఎపి భవన్ ద్వారా తిరుగు ప్రయాణ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అక్కడి వారంతా గురువారం మధ్యాహ్నం 12 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రావడానికి ఏర్పాట్లు చేశామని విజయనగరం జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 9491222122 ఫోన్ నంబరుతో అత్యవసర సహాయ హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. సమాచారాన్ని ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌కు చేరవేసి సహాయ చర్యలు వేగవంతం చేసినట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నేపాల్ పర్యటన నిమిత్తం వారం రోజుల క్రితం పర్యటనకు వెళ్లిన విశాఖకు చెందిన ఎల్‌విసి ఉద్యోగులు ప్రస్తుతం అక్కడ క్షేమంగానే ఉన్నట్లు సహోద్యోగులకు చెబుతున్నారు. అయితే, నేపాల్‌లో విశాఖకు చెందిన వారు చిక్కుకున్న విషయాన్ని జిల్లా అధికార యంత్రాంగం ధ్రువీకరించలేదు.

బాధితుల్లో ఏపిఎంఎస్ఇడిసి చైర్మన్ అక్క, బావ

ముక్తినాథ్ యాత్రకు వెళ్లి నేపాల్‌లో చిక్కుకుపోయిన గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన వారితో మంత్రి లోకేష్ మాట్లాడారని, వీరికి క్షేమంగా తీసుకొచ్చే బాధ్యతను తనకు అప్పగించారని ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక సదుపాయల అభివృద్ధి సంస్థ (ఎపిఎంఎస్ఇడిసి) చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు తెలిపారు.

దసరాకు 'వాయుపుత్ర'

చందూ మొండేటి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సంస్థలు నిర్మిస్తున్న చిత్రం 'వాయుపుత్ర'. శ్రీకర ప్రొడక్షన్స్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. దసరా పండుగ సందర్భంగా విడుదల కానున్న ఈ సినిమా వాల్‌పోస్టర్‌ను చిత్ర యూనిట్ బుధవారం ఆవిష్కరించింది.

తెలంగాణలో పిడుగుపాటుకు ఏడుగురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో పిడుగుపాటుకు ఏడుగురు మృతిచెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వీరంతా పొలంలో పనులు చేస్తుండగా దుర్మరణం చెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భూమూర్‌లో తాటిచెట్టుపై పిడుగుపడడంతో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం గుమ్మెంఎంగ్లాపూర్‌కు చెందిన రైతు దంపతులు ఎల్లయ్య, ఎల్లవ్వతోపాటు మరో కార్మికుడు పొలంలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా వారికి సమీపంలో పిడుగు పడడంతో ముగ్గురూ మరణించారు. భద్రాది కొత్తగూడెం జిల్లా గుండాల మండలం చీమలగూడెం గ్రామానికి చెందిన పాయం నర్సయ్య (50) సమీపంలో పిడుగుపడింది. దీంతో ఆయన అక్కడికక్కడే మరణించారు.



ముంబైలో బాలకృష్ణ సందడి

సినీ నటుడు, హిందూపురం శాసనసభ్యుడు నందమూరి బాలకృష్ణ ముంబైలో సందడి చేశారు. అక్కడి ఆంధ్ర ఎడ్యుకేషన్ సొసైటీ స్కూల్‌ను సందర్శించి, విద్యార్థులకు స్ఫూర్తిని అందించారు. గత 77 సంవత్సరాలుగా తెలుగు సమాజానికి విద్యా సేవలు అందిస్తున్న ఈ సంస్థ, తన గొప్ప చరిత్రతో విద్యా రంగంలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉంది. నర్సరీ నుండి 12వ తరగతి వరకు విద్యను అందిస్తున్న ఈ పాఠశాలలో సుమారు 4,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. 150 మంది అధ్యాపకులు, సిబ్బంది వీరికి నాణ్యమైన విద్యను అందిస్తూ, వారి భవిష్యత్తును తీర్చిదిద్దుతున్నారు. బాలకృష్ణ సందర్శనతో విద్యార్థులు ఉత్సాహంతో ఆయనతో సంభాషించారు. బాలకష్ణకు పాఠశాల అధ్యక్షుడు రామ్మోహన్ బండ్లమూడి, జనరల్ సెక్రటరీ కృష్ణప్రసాద్ ఘన స్వాగతం పలికారు.

'అర్జున్ చక్రవర్తి'కి 4 అంతర్జాతీయ అవార్డులు

- కెమెరామెన్ జగదీష్ చీకటి



'అర్జున్ చక్రవర్తి' చిత్రంలో నేను కెమెరామెన్‌గా చేసిన కృషికి గాను అంతర్జాతీయస్థాయిలో నాలుగు అవార్డులు వచ్చాయి. జెఎన్టీయూ ఫైన్ ఆర్ట్స్ కాలేజీలో చదువుతున్న రోజుల్లోనే ఫొటోగ్రఫీలో ఎన్నో అవార్డులు సాధించా. నాకు డ్రాయింగ్, ఫొటోగ్రఫీ అంటే చాలా ఇష్టం. ఫొటోగ్రఫీలో మాస్టర్స్‌చేశా. ఆ తర్వాత దూరదర్శన్‌లోనూ పని చేశా. స్టిల్ ఫొటోగ్రఫీలోనూ అవార్డులొచ్చాయి. 100కుపైగా షార్ట్ ఫిల్మ్స్, డాక్యుమెంటరీ ఫిల్మ్స్, ఎన్నో కమర్షియల్ యాడ్స్, ఎన్నో ప్రాజెక్టులను చేశా. అలా చేస్తున్న సమయంలోనే 'జత కలిసే' మూవీకి అవకాశం వచ్చింది. అక్కడ కొత్త వాళ్లందరం కలిసి ఆ మూవీని చేశాం. ఆ సమయంలోనే 'నాయకి', ఆర్జీవీ ప్రొడక్షన్స్ నుంచి 'భైరవ గీత' ఇలా చాలా ప్రాజెక్ట్‌లు వచ్చాయి. సినిమాల్లోకి వెళ్తానని చెప్పగానే మొదట్లో కుటుంబ సభ్యులు ఒప్పుకున్నారు. నాన్న ఇరిగేషన్ డిపార్ట్మెంట్‌లో ఉద్యోగి. ఎప్పుడూ బాగా సహకరించేవారు. నచ్చిన పని ఏదైనా సరే చేయి. నూరుశాతం ఎఫర్ట్ పెట్టు అని భుజం తట్టేవారు. 'అర్జున్ చక్రవర్తి' సినిమాను హాలీవుడ్ స్థాయి ప్రమాణాలతో తీశాం. నేచురల్ లైటింగ్‌లోనే షూటింగ్ చేశాం. కాశ్మీర్‌లో షూటింగ్ సమయంలో కొన్ని ఇబ్బందులు పడ్డాం. 'భైరవ గీత' మూవీని చూసిన దర్శకుడు విక్రాంత్ రుద్ర ఈ మూవీకి నన్ను సంప్రదించారు. వరల్డ్ క్లాస్ స్టాండర్డ్స్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించాలని అనుకున్నాం. అందులో భాగంగానే రకరకాల వేరియేషన్స్‌తో మూవీని తీశాం. పాత్ర తీరు, ప్రయాణానికి తగ్గట్టుగా కలర్ వేరియేషన్స్ చూపించా. మూడు రకాల కెమెరాలతో షూట్ చేశాం. విజన్ డిఫరెన్స్ ఉండాలని ఎన్ మోర్ఫిక్, స్ఫెరికల్ లెన్స్‌లను వాడాం. క్యాస్టూమ్స్, ఆర్ట్ డిపార్ట్మెంట్ ఇలా ప్రతీ విషయంలోనూ ఎంతో జాగ్రత్త తీసుకున్నాం. డైరెక్టర్ విక్రాంత్ రుద్ర మంచి నిపుణత, టాలెంట్‌ను చూపించారు. కోలీవుడ్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఇండియా, కేరవ్యాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, మోకో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్, ది బుద్దా ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డులు వచ్చాయి' అని సినిమాటోగ్రాఫర్ జగదీష్ చీకటి అన్నారు. 'అర్జున్ చక్రవర్తి' సినిమా విజయవంతంగా ప్రదర్శితమవు తుండటంతోపాటుగా అంతర్జాతీయ స్థాయిలో నాలుగు అవార్డులను సైతం గెల్చుకుంది. ఈ సినిమాకు పనిచేసిన కెమెరామెన్ జగదీష్ చీకటి పనితీరును అందరూ అభినందిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన పై విధంగా స్పందించారు.

27న 'సేవ్ స్మాల్ సినిమా' సైక్లథాన్

సినెటేరియా ఫౌండేషన్, హైదరాబాద్ సైక్లింగ్ క్లబ్‌లు సంయుక్తంగా సేవ్ స్మాల్ (స్మాల్ బడ్జెట్) సినిమా-మెగా ఫ్రెండ్‌షిఫ్ సైక్లథాన్ కార్యక్రమాన్ని ఈనెల 27న నిర్వహించనున్నట్లుగా ఆయా సంస్థల ప్రతినిధులు తెలిపారు. హైదరాబాద్‌లోని ఫిలిం చాంబర్ నుంచి కె.బి.ఆర్ పార్క్ వరకూ ఈ ర్యాలీ జరగనుంది. సినిమా నిర్మాతలు, దర్శకులు, టెక్నీషియన్లు, నటీ నటులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. చిన్న సినిమా నిర్మాతలు, సినిమా నిర్మాణం, పబ్లిసిటీ, విడుదల, సినిమాల వాణిజ్యం రంగాల్లో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈ కార్య క్రమాన్ని ఏర్పాటుచేసినట్లుగా వివరించారు. ఆసక్తి కలవారు తమ పేర్లు నమోదు చేసుకోవాలనీ, ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. పాల్గొన్న వారికి టీ-షర్ట్, క్యాప్, పార్టిసిపేషన్ సర్టిఫికెట్ అందజేస్తామని వివరించారు. మరిన్ని వివరాలకోసం ఫోన్ : 0 87122 17555 సంప్రదించాలని కోరారు.

అతిసార, విష జ్వరాలతో ఇద్దరు మహిళలు మృతి

విజయవాడలో అతిసార ప్రబలి 50 మందికి అస్వస్థత

ప్రజాశక్తి - యంత్రాంగం (ఎన్‌టిఆర్‌జిల్లా)

అతిసార, విష జ్వరాలతో ఎన్‌టిఆర్ జిల్లాలో ఇద్దరు మహిళలు మరణించారు. విజయవాడలో అతిసార ప్రబలి ఒకరు మరణించగా, సుమారు 50 మంది వరకు వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. స్థానికుల కథనం ప్రకారం....విరోచనాలు, వాంతులతో బాధపడుతున్న విజయవాడ న్యూ రాజరాజేశ్వరి పేటకు చెందిన శ్రీరామ నాగమణి (61) అనే మహిళ మంగళవారం ఉదయం ప్రభుత్వాస్పత్రిలో చేరారు. చికిత్స పొందుతూ మరణించారు. అతిసార బారిన పడిన సుమారు 50 మంది వరకు విజయవాడ ప్రభుత్వాస్పత్రి, వివిధ అర్బన్ హెల్త్ సెంటర్లలో చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ బుధవారం రాత్రి పరామర్శించారు. వారికి అందిస్తున్న చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో మొత్తం 22 మంది చికిత్స పొందుతుండగా, ఇప్పటికే ఇద్దరిని డిశ్చార్జి చేసినట్లు తెలిపారు. బాధితుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ తెలిపారు. తాగునీరు, ఆహార నమూనాలను పరీక్షలకు పంపామని, ముందు జాగ్రత్తగా న్యూ రాజరాజేశ్వరి పేటలో కుళాయి నీటి సరఫరాను ఆపేసి ట్యాంకర్ల ద్వారా మంచినీరు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. మహిళ మృతికి, అతిసార ఘటనకూ ఎటువంటి సంబంధంలేదన్నారు. ఆస్పత్రికి వచ్చిన కలెక్టర్ లక్ష్మీశను సిపిఎం విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు, విఎంసిలో సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు తదితరులు కలిసి బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అతిసారతో మరణించిన శ్రీరామ నాగమణి కుటుంబాన్ని సిపిఎం నేతలు పరామర్శించారు. అలాగే నందిగామ పట్టణంలో విష జ్వరంతో సముద్రాల మహి (22) అనే మహిళ బుధవారం మృతిచెందారు. రెండు రోజుల క్రితం మంగళగిరి ఎయిమ్స్‌లో చేరిన ఆమె అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.


బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ లక్ష్మీశకు పరిస్థితిని వివరిస్తున్న సిపిఎం నేతలు


వర్ధంతి సభలో మాట్లాడుతున్న గురు శేఖర్

ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ ఆశయాలు కొనసాగిద్దాం

- వర్ధంతి సభలో ఏపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురుశేఖర్

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు (కర్నూలు)

చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ ఆశయాలను ముందుకు తీసుకువెళ్తామని ఏపి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సి.గురుశేఖర్, ఉద్యోగుల సంఘం నాయకులు సిద్ధప్ప, మహిళా నాయకులు ఎల్ఎస్.రత్నమ్మ, సిహెచ్ రామన్న తెలిపారు. చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణ వర్ధంతి సభ కర్నూలు జిల్లా పద్మశాలి కల్యాణ మండపంలో బుధవారం జరిగింది. ఏపి రజక వృత్తిదారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు సి.హనుమంతు అధ్యక్షత వహించారు. ముందుగా ఐలమ్మ, రామకృష్ణ చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురుశేఖర్, సిద్ధప్ప, రత్నమ్మ, రామన్న మాట్లాడారు. ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యం కోసం సాయుధ రైతాంగ పోరాటంలో తన వంతు పాత్ర పోషించిన చాకలి ఐలమ్మ చరిత్రను ఈ తరం గుర్తుపెట్టుకోవాలని, ఆమె జీవిత చరిత్ర భావితరాలకు తెలియజేయాలని అన్నారు. తన పోరాట పటిమతో రజకులకు కీర్తిని సంపాదించి పెట్టారని కొనియాడారు. రైతాంగ సాయుధ పోరాటం ఫలితంగా నిజాం నవాబుల ఆధీనంలో ఉన్న పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంపిణీ జరిగిందని తెలిపారు. 2000 సంవత్సరం ఆగస్టు 28న విద్యుత్ ఉద్యమంలో సత్తెనపల్లి రామకృష్ణ వీరమరణం పొందారన్నారు. ఎస్‌సి, ఎస్‌టి తరహాలో రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భరత్, ఎంఇఒ నాగప్ప పాల్గొన్నారు.

అధునాతన వైద్యం.. అత్యున్నత ప్రమాణాలే లక్ష్యం

- డాక్టర్ తుమ్మలూరి శిద్ధయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మారుతున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వైద్యవిద్యలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పడమే లక్ష్యంగా డాక్టర్లంతా కృషిచేయాలని శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీ విశ్రాంత రిజిస్ట్రార్, ఎపి ఎక్స్పర్ట్‌మెంబర్, నాక్ పీర్ టీమ్ చైర్మన్ డాక్టర్ తుమ్మలూరి శిద్ధయ్య అన్నారు. విజయవాడలోని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంలోని సెమినార్ హాలులో 'అధునాతన టెక్నాలజీ-వైద్య విద్యలో అన్వయించటం-జాతీయ విద్యావిధానం-2020'పై బుధవారంనాడు ఆన్‌లైన్ సమావేశం జరిగింది. రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాళ్లు, ఇతర కళాశాల నిర్వహణ మండలి ప్రతినిధులు పాల్గొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ముఖ్యఅతిథిగా తూములూరి సిద్ధయ్య మాట్లాడారు. కృత్రిమమేధ, ఎఐ టూల్స్ వంటివి ఉపయోగించుకుని సులభంగా వైద్య సేవలు అందించే సృజనాత్మక టెక్నాలజీ నేడు ప్రపంచవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చిందన్నారు. ప్రొఫెసర్లు, డాక్టర్లు, నర్సులు, ఇతర సిబ్బంది వైద్య సేవలను గతంతో పోలిస్తే ఇప్పుడు అత్యంత సులభంగా అందించే టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిందన్నారు. గతంతో పోలిస్తే నేడున్న టెక్నాలజీ ప్రభావంతో వైద్య విద్యలో సరికొత్త పద్ధతులు, చికిత్సలు, పాటించాల్సిన విషయాలపై అవగాహన పెంపొదటానికి విపరీతమైన వైద్య విజ్ఞాన సంపద కూడా అందుబాటులో ఉందని వివరించారు. అందువల్ల ఆయా టెక్నాలజీ, వైద్య పద్ధతులను ప్రతిఒక్కరూ అందిపుచ్చుకోవటం ద్వారా రోగులకు మెరుగైన, నాణ్యమైన, వేగవంతమైన చికిత్సలు చేయటానికి అవకాశం ఉందన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా వైద్య కళాశాలల్లో ల్యాబులు, ఆపరేషన్ థియేటర్లు, ఇతర మౌళిక వసతులు పెంచుకోవటం ద్వారా రోగులకు మంచి సాంత్వన ఇచ్చే అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉపకులపతి పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ వైద్యవిద్యలో నాణ్యత పెంపుపై దృష్టి సారించామన్నారు. రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డి మాట్లాడారు. అనంతరం 'ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్' అనే అంశంపై జరిగిన సదస్సులో సిద్ధయ్య ముఖ్యఅతిథిగా మాట్లాడారు. దేశంలోని అత్యుత్తమ వైద్య కళాశాలలకు నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్) ర్యాంకులు ఇస్తుందని వాటిని కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ సూర్యప్రభ, పబ్లికేషన్స్ డైరెక్టర్ డాక్టర్ సుధ, రీసెర్చ్ విభాగం కమిటీ సభ్యులు డాక్టర్ తుమ్మల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం తుమ్మలూరి శిద్ధయ్యను ఘనంగా యూనివర్శిటీ తరపున సత్కరించారు.

డిప్యూటీ సిఎం ఫొటోపై పిల్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

ప్రభుత్వ కార్యాలయాల్లో ముఖ్యమంత్రితోపాటు ఉప ముఖ్యమంత్రి ఫొటోను కూడా పెట్టడాన్ని సవాల్ చేసిన పిల్‌ను హైకోర్టు డిస్మిస్ చేసింది. డిప్యూటీ సిఎం ఫొటో ఆఫీసుల్లో పెట్టరాదని ఏ చట్టంలో ఉందో చెప్పాలని పిటిషన్‌ను ప్రశ్నించింది. ఇలాంటి నిషేధం ఎక్కడ ఉందో చూపాలని ఆదేశించింది. రాజకీయంగా పిల్ వేశారని తప్పుపట్టింది. ఫొటోల ప్రదర్శనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్ట విధానం ఏమీ తేలేదని గుర్తు చేసింది. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ఫొటోలను ఏర్పాటు చేయకుండా ఉత్తర్వులు జారీ చేయబోమని తేల్చి చెప్పింది.

రూ.2,532కోట్లు

- 2023-24 లో 40 ప్రాంతీయ పార్టీల ఆదాయం
- టాప్‌లో బిఆర్‌ఎస్, టిఎంసి

న్యూఢిల్లీ : 2023-24 ఆర్థిక సంవత్సరంలో 40 ప్రాంతీయ రాజకీయ పార్టీలు రూ.2,532 కోట్ల మొత్తం ఆదాయాన్ని ప్రకటించాయి. పార్టీల నిధుల్లో 70శాతం కంటే ఎక్కువ ఎన్నికల బాండ్ల ద్వారా వస్తున్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) నివేదిక తెలిపింది. ఈ నివేదిక ప్రకారం ఆదాయంలో తెలంగాణకు చెందిన బిఆర్‌ఎస్ రూ.685.51 కోట్ల అత్యధిక ఆదాయంతో మొదటి స్థానంలో ఉంది. ఆతర్వాత పశ్చిమ బెంగాల్‌కు చెందిన టిఎంసి రూ.646.39 కోట్లు, బిజు జనతాదళ్ (బిజెడి) రూ.297.81కోట్లు, టిడిపి రూ.285.07 కోట్లు, వైఎస్‌ఆర్ కాంగ్రెస్ రూ.191.04 కోట్ల ఆదాయంతో ఉన్నాయి. 40ప్రాంతీయ పార్టీలు ప్రకటించిన మొత్తం ఆదాయంలో ఈ ఐదు పార్టీలు 83.17శాతం వాటా కలిగి ఉన్నాయి. మొత్తం ఆదాయంలో, రూ.2,117.85 కోట్లు (83.64శాతం) స్వచ్ఛంద విరాళాల నుండి రాగా, ఎన్నికల బాండ్ల నుండి 70.93శాతం విరాళాలు వచ్చినట్లు బిఆర్‌ఎస్, టిఎంసి, బిజెడి, టిడిపి, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, డిఎంకె సహా 10 పార్టీలు ప్రకటించాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే.. ప్రాంతీయ పార్టీల మొత్తం ఆదాయం 45.77శాతం గణనీయంగా పెరిగిందని ఎడిఆర్ పేర్కొంది. ఆ ఆర్థిక సంవత్సరం వారి మొత్తం ఆదాయం రూ.1,736.85కోట్లుగా ఉంది. టిఎంసి రూ.312.93 కోట్ల పెరుగుదలను నమోదు చేయగా, టిడిపి మరియు బిజెడి కూడా గణనీయమైన పెరుగుదలను నమోదు చేశాయి.

27 పార్టీలు తమ ఆదాయంలో కొంత భాగాన్ని ఖర్చు చేయలేదని ప్రకటించగా, 12 రాజకీయ పార్టీల ఖర్చులు ఆదాయాన్ని మించిపోయాయి.బిఆర్‌ఎస్ ఖర్చు చేయని ఆదాయం నుండి రూ.430.60 కోట్లు సంపాదించగా, టిఎంసి రూ.414.92కోట్లు, బిజెడి రూ.253.79 కోట్లు సంపాదించాయి. అయితే వైఎస్‌ఆర్ కాంగ్రెస్, డిఎంకె, సమాజ్ వాది పార్టీ మరియు జనతాదళ్ (యునైటెడ్) సహా 12 పార్టీలు తమ ఆదాయం కన్నా ఎక్కువ ఖర్చు చేసినట్లు తెలిపాయి. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ ఖర్చులు సుమారు 55 శాతం పెరగగా, గోవా ఫార్వర్డ్ పార్టీ ఆదాయం లేదని నివేదించింది కానీ ఖర్చులు రూ.1.56 లక్షలుగా ప్రకటించింది.

12న సిపి రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం !

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో విజయం సాధించిన రాధాకృష్ణన్ ఈ నెల 12న ప్రమాణస్వీకారం చేయనున్నట్లు సమాచారం. రాధాకృష్ణన్ చేత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. అందుకోసం రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ దన్‌ఖర్ రాజీనామా చేయడంతో ఉపరాష్ట్రపతి ఎన్నిక అనివార్యమైంది. ఎన్‌డిఎ అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ పోటీ చేశారు. ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని బరిలో దింపారు. అలాగే, మరోవైపు మహారాష్ట్ర గవర్నర్ పదవికి సిపి రాధాకృష్ణన్ మరికొన్ని గంటల్లో రాజీనామా చేయనున్నట్లు తెలుస్తోంది.

ఉపరాష్ట్రపతి నిష్పక్షపాతంగా వ్యవహరించాలి : జైరాం రమేష్

న్యూఢిల్లీ : దేశ 15వ ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ చైర్మన్‌గానూ ఎన్నికైన సి.పి.రాధాకృష్ణన్‌కు కాంగ్రెస్ కమ్యూనికేషన్ ప్రతినిధి జైరాం రమేష్ బుధవారం శుభాకాంక్షలు తెలిపారు. ఉపరాష్ట్రపతి నిష్పక్షపాతంగా వ్యవహరించడం ముఖ్యమని పేర్కొంటూ.. మొట్టమొదటి ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ అయిన డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ఉదహరించారు. "ప్రభుత్వ విధానాలను నిష్పాక్షికంగా, స్వేచ్ఛగా, స్పష్టంగా విమర్శించడానికి ప్రతిపక్షాలను అనుమతించకపోతే ఆ ప్రజాస్వామ్యం నిరంకుశత్వంగా దిగజారిపోయే అవకాశం ఉంది" అని పేర్కొన్నారు.

1952 మే16న రాజ్యసభ ప్రారంభం రోజున సర్వేపల్లి ఈవిధంగా అన్నారు. "నేను ఏ పార్టీకి చెందిన వాడిని కాదు. అంటే ఈ సభలోని ప్రతి పార్టీకి చెందినవాడిని. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం అత్యున్నత విలువలను, సాంప్రదాయాలను నిలబెట్టడం, ప్రతి పార్టీ పట్ల న్యాయంగా మరియు నిష్పాక్షికంగా వ్యవహరించడం, ఎవరిపట్లా ద్వేషం లేకుండా, అందరిపట్ల సద్భావనతో వ్యవహరించేందుకు యత్నిస్తాను. ప్రభుత్వ విధానాలను ప్రతిపక్ష పార్టీలు న్యాయంగా, స్వేచ్ఛగా మరియు స్పష్టంగా విమర్శించడానికి అనుమతించకపోతే ప్రజాస్వామ్యం నిరంకుశత్వంగా దిగజారిపోయే అవకాశం ఉంది" అని ఎక్స్‌లో పేర్కొన్నారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ తాను బోధించిన దానిని అక్షరాలా మరియు స్ఫూర్తితో ఆచరించారు అని ఉద్ఘాటించారు.

సుప్రీంకోర్టుకు ఉమర్ ఖలీద్

న్యూఢిల్లీ : 2002 ఢిల్లీ అల్లర్ల కేసులో తన బెయిల్ పిటిషన్‌ను నిరాకరిస్తూ ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ సామాజిక కార్యకర్త ఉమర్ ఖలీద్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ప్రదర్శనలు లేదా నిరసనల ముసుగులో కుట్రపూరిత హింసను అనుమతించలేమంటూ ఢిల్లీ హైకోర్టు ఈ నెల 2న ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్ సహా పదిమందికి బెయిల్ నిరాకరించింది. బెయిల్ తిరస్కరణకు గురైన వారిలో ఉమర్ ఖలీద్, షార్జిల్ ఇమామ్, మొహమ్మద్ సలీమ్‌ఖాన్, షిఫా ఉర్ రెహమాన్, అథర్ ఖాన్, మీరాన్ హైదర్, అబ్దుల్ ఖలీద్ సైఫీ, గుల్ఫిషా ఫాతిమా మరియు షాబాద్ అహ్మద్‌లు ఉన్నారు. మరో నిందితుడు తస్లీమ్ అహ్మద్ బెయిల్ పిటిషన్‌ను సెప్టెంబర్ 2న మరో హైకోర్టు బెంచ్ తిరస్కరించింది.

హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ గతవారం షార్జిల్ ఇమామ్, గుల్ఫిషా ఫాతిమాలు సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే.

పొరుగు దేశాల్లో పరిస్థితి చూడండి

- రాజ్యాంగం మనకు గర్వకారణం
- రాష్ట్రపతి పంపిన ప్రస్తావనపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు
- ఎన్ని బిల్లులను నిలిపివేశారని కాదు, నిలిపివేసే అధికారంపైనే ప్రశ్న
- నేడు కూడా కొనసాగనున్న విచారణ



న్యూఢిల్లీ : పొరుగుదేశాల్లో పరిస్థితిని చూడాలని, మన రాజ్యాంగం మనకు గర్వకారణమని సుప్రీంకోర్టు బుధవారం వ్యాఖ్యానించింది. అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్రపతి, గవర్నర్లకు కాల పరిమితులు విధించవచ్చా లేదా అనే అంశంపై రాష్ట్రపతి పంపిన ప్రస్తావనపై సుప్రీంకోర్టు బుధవారం కూడా తన విచారణను కొనసాగించింది. ఈ సందర్భంగా పై వ్యాఖ్యలు చేసింది. 'నేపాల్‌లో నిరసనలు హింసాత్మకంగా మారాయి. దీంతో అక్కడ రాజకీయ సంక్షోభం ఏర్పడింది. కొన్ని నెలల క్రితం బంగ్లాదేశ్‌లోనూ ఇదే పరిస్థితి. ప్రధాని పదవికి రాజీనామా చేసి షేక్ హసీనా.. ఆ దేశాన్ని వీడి భారత్‌లో తలదాచుకుంటున్నారు' అని గుర్తు చేస్తూ మన రాజ్యాంగం పట్ల గర్వపడుతున్నట్లు ప్రధాన న్యాయమూర్తి బి ఆర్ గవాయ్ తెలిపారు. అలాగే దేశంలో గత కొన్ని దశాబ్దాలుగా రాజ్యాంగం పనిచేస్తోందని జస్టిస్ విక్రమ్ నాథ్ పేర్కొన్నారు.

అలాగే, బుధవారం విచారణలో బిల్లులను నెల రోజులకు పైగా రిజర్వ్ చేసే విషయంలో గవర్నర్ల అధికారాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సమర్థించారు. అటువంటి కేసులు తక్కువే ఉన్నాయన్నారు. రాష్ట్రప్రభుత్వం ఆమోదించిన అన్ని బిల్లుల్లో 90 శాతం బిల్లులకు గవర్నర్ నెలలోపే సమ్మతి తెలుపుతారని చెప్పారు. 1970 నుంచి 2025 వరకు తమిళనాడుకు చెందిన ఏడు బిల్లులు సహా కేవలం దేశవ్యాప్తంగా 20 బిల్లులు మాత్రమే రిజర్వ్‌లో ఉన్నట్లు ధర్మాసనం దృష్టికి తీసుకునివెళ్ళారు. దీనికి జస్టిస్ నాథ్ స్పందిస్తూ గవర్నర్ ఒక్క బిల్లును నిలిపివేశారా.. వెయి బిల్లులను నిలిపివేశారా... అన్నది ప్రశ్న కాదని, బిల్లులను గవర్నర్ నిరవధికంగా నిలిపివేసే అధికారం.. ఉందా.. లేదా.. అన్నదే ప్రశ్న అని స్పష్టం చేశారు. అలాగే తుషార్ మెహతా తన వాదనలో గవర్నర్ ఒక స్వతంత్ర రాజ్యాంగ పదవి, ప్రభుత్వ సేవకుడు కాదని తెలిపారు. బిల్లులకు గవర్నర్ ఆమోదం కేవలం లాంఛనప్రాయం కాదని, చాలా ముఖ్యమైనదని అన్నారు. తుషార్ మెహతా వాదనలను జస్టిస్ నరసింహ సమీక్షిస్తూ 'గవర్నర్ బిల్లులకు అనుమతి ఇవ్వకుండా నిలువరించగలరనే వాదనను ఎలా సమన్వయం చేసుకోవాలి? ఉభయ సభలు ఆమోదించిన బిల్లును గవర్నర్ ఎలా పూర్తిగా నిలుపదల చేస్తారు' అని ప్రశ్నించారు. బుధవారం వాదనలు ముగిసిన తరువాత తదుపరి విచారణను సుప్రీంకోర్టు గురువారానికి వాయిదా వేసింది. 200, 201 అధికరణల కింద గవర్నర్ల విచక్షణ యొక్క రాజ్యాంగ పరిధిని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ అధ్యక్షతన గల ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తోంది.ఈ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు.

నేడు విశాఖలో సీతారాం ఏచూరి భవన్ ప్రారంభం

- ముఖ్య అతిథిగా ఎంఎ బేబీ

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలోని పిఠాపురం కాలనీ, కళాభారతి రోడ్డులో నిర్మించిన సీతారాం ఏచూరి భవన్ (సిపిఎం విశాఖ జిల్లా కార్యాలయం) గురువారం ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభం కానుంది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ ప్రధాన కార్యదర్శి ఎంఎ.బేబీ హాజరుకానున్నారు. విశిష్ట అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, అతిథులుగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, కె.లోకనాథం, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పూర్వ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బి.పద్మ, పార్టీ జివిఎంసి ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు హాజరుకానున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షత వహించనున్నారు. పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు, అభిమానులు, కార్మికులు, మహిళలు, యువతీ యువకులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పార్టీ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.

గాజువాకలో ఉక్కు పరిరక్షణ సభ

సాయంత్రం ఐదు గంటలకు ఉక్కు పరిరక్షణపై గాజువాకలో సభ జరుగనుంది. ఈ సందర్భంగా కొత్త గాజువాక పెట్రోల్ బంక్ నుంచి పాత గాజువాక వరకూ ప్రదర్శన చేపట్టనున్నారు. పాత గాజువాక జంక్షన్‌లో జరిగే సభలో ఎం.ఎ.బేబీ సహ వి.శ్రీనివాసరావు, కె.లోకనాథం, పలువురు పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు ప్రసంగించనున్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని జాతీయ స్థాయికి తీసుకువెళ్లాలనే నిశ్చయంతో ఈ సభను సిపిఎం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.



విశాఖలో ప్రారంభానికి సిద్ధమైన సీతారాం ఏచూరి భవన్

బీహార్‌లో రోడ్లు, రైల్వే ప్రాజెక్టులకు ఆమోదం

- కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఈ ఏడాదిలో ఎన్నికలు జరగబోయే బీహార్‌లో ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం పెద్దపీట వేసింది. బుధవారం నాడిక్కడ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం జరిగింది. బీహార్‌లోని బక్సార్ - భాగల్‌పూర్ హైస్పీడ్ కారిడార్ పరిధిలోని మోకామా - ముంగేర్ నలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ఆమోదం తెలిపింది. మొత్తం 82.4 కిలో మీటర్ల పొడవున్న ఈ రహదారి ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 4,447.38 కోట్లుగా నిర్ణయించారు.

దీంతో పాటు బీహార్‌లోని భాగల్పూర్ డంకా రాంపూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని భాగల్పూర్-దుమ్కా-రాంపూర్హాట్ సింగిల్ రైల్వే లైన్ సెక్షన్ 177 కిలోమీటర్ల రైల్వే డబ్లింగ్ పనులకు రూ.3,169 కోట్ల కేంద్రం ఖర్చు చేయనుంది.

పారిస్‌లో ఆందోళనలు

అధ్యక్షుడు మాక్రాన్‌కు వ్యతిరేకంగా



పారిస్ : రాజధాని పారిస్‌లో, ఫ్రాన్స్ వ్యాప్తంగా పలు చోట్ల ఆందోళనలు చెలరేగాయి. 'బ్లాక్ ఎవ్విరీథింగ్' గ్రూపు నేతృత్వంలో ఆందోళనకారులు బుధవారం పారిస్‌వీధుల్లో రోడ్లను దిగ్బంధించి, వాహనాలకు నిప్పంటించి హింసాత్మక చర్యలకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు బాష్పవాయు గోళాలను ప్రయోగించారు. మాక్రాన్ నియమించిన కొత్త ప్రధానికి క్లిష్టతరమైన పరిస్థితులను సృష్టించడం ద్వారా అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్‌పై బలమైన ఒత్తిడి తీసుకురావాలని ఆందోళనకారులు భావిస్తున్నారు. బుధవారం దేశవ్యాప్తంగా ఆందోళనలు ప్రారంభమైన తొలి గంటల వ్యవధిలోనే దాదాపు 200మందిని అరెస్టు చేసినట్లు హోంమంత్రి ప్రకటించారు. ఆందోళనకారులను అడ్డుకోవ డానికి దాదాపు 80వేల మంది పోలీసులను రంగంలోకి దించారు, తక్షణమే అరెస్టు చేసేలా చర్యలు తీసుకున్నారు. అయినా వారి నిరసనలను అడ్డుకోలేకపోయారు. రెనెస్ నగరంలో ఆందోళనకారులు బస్సుకు నిప్పంటించారు. విద్యుత్ లైన్‌ను ధ్వంసం చేయడంతో ఆ లైన్‌లో వెళ్ళే రైళ్ళన్నీ నిలిచిపోయాయి. తిరుగుబాటు వాతావరణాన్ని సృష్టించేందుకు ఆందోళనకారులు ప్రయత్నించారని హోం మంత్రి బ్రూనో రెటాలియె వ్యాఖ్యానించారు.

ఫెడరల్ రిజర్వ్ గవర్నర్‌ను తొలగించకుండా ట్రంప్‌ను నిలువరించిన ఫెడరల్ జడ్జి

వాషింగ్టన్ : అమెరికా ఫెడరల్ రిజర్వ్ గవర్నర్ లిసా కుక్‌ను తొలగించకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను తాత్కాలికంగా నిలువరిస్తూ ఫెడరల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. కేంద్ర బ్యాంక్‌కు దీర్ఘకాలంగా వున్న స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సవరించడానికి గతంలో ఎన్నడూ లేని రీతిలో వైట్‌హౌస్ చేపట్టిన న్యాయ పోరాటంలో ఇది ముందస్తు ఎదురు దెబ్బ. కాగా దీనిపై వైట్‌హౌస్ ఎలాంటి వ్యాఖ్య చేయలేదు. గవర్నర్ పదవిని చేపట్టడానికి ముందుగానే లిసా తాకట్టు కుంభకోణానికి పాల్పడ్డారని ట్రంప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. అయితే ప్రభుత్వం చేస్తున్న వాదనలు ఆమెను తొలగించడానికి సరైన కారణమేనా అనే కీలక అంశాన్ని అమెరికా డిస్ట్రిక్ట్ జడ్జి జియా కాబ్ ఇచ్చిన రూలింగ్ పరిష్కరించలేదు. కాగా తానెలాంటి తప్పు చేయలేదని లిసా కుక్ చెబుతున్నారు. ఆగస్టు చివరిలో కుక్‌ను తొలగించడానికి ట్రంప్ చర్యలు మొదలుపెట్టారు. కానీ ఆమె తన పదవిలో వుంటారని ఫెడరల్ రిజర్వ్ పేర్కొంది.

మాస్కోలో తొలి ఎఐ ట్రామ్!



మాస్కో : కృత్రిమ మేధస్సు (ఎఐ)తో రష్యాలోనే తొలి స్వయం ప్రతిపత్తి (అటానమస్) ప్రయాణికుల ట్రామ్‌ను మాస్కోలో ప్రారంభించారు. మాస్కో ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. 2030నాటికి మాస్కోను రవాణాపరంగా అభివృద్ధిపరచాలన్న లక్ష్యంలో భాగంగా ఈ ప్రాజెక్టు చేపట్టారు. అప్పటికల్లా 300కి పైగా ట్రామ్‌లు ఈ సాంకేతికతను సమకూర్చుకుంటాయని భావిస్తున్నారు. ఈ అటానమస్ ట్రామ్ ట్రాఫిక్ సిగ్నల్స్‌కు అనుగుణంగా ఆగడం, తలుపులు తెరుచుకోవడం, మూసుకోవడం వంటి చర్యలను స్వతంత్రంగానే చేస్తుంది. ట్రాక్‌లను కూడా ఆటోమేటిక్‌గా మార్చేస్తుంది. షెడ్యూళ్ళను కచ్చితంగా పాటిస్తుంది. గతేడాది మే నుండి ఈ ట్రామ్ 8వేల కిలోమీటర్లకు పైగా ట్రయల్ రన్ తిరిగింది. ఎక్కడా ఒక్కసారి కూడా ట్రాఫిక్ ఉల్లంఘన జరగలేదు. ఫెడరల్ చట్టాల ప్రకారం ట్రామ్ కేబిన్‌లో ఒక ఆపరేటర్ వుంటాడు. మొత్తంగా వ్యవస్థను, డ్రైవింగ్‌యేతర కార్యకలాపాలను పర్యవేక్షించడం అతని బాధ్యత. కృత్రిమ మేధస్సుతోనడిచే ఈ ట్రామ్‌లో మాస్కోలోనే అభివృద్ధిపరిచిన అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ వుంది. ఈ ఏడాది చివరకు ఇటువంటి మూడు ట్రామ్‌లు తిరగాలన్నది ఆలోచనగా వుంది. వచ్చే ఏడాదికి 15కి పెంచాలని భావిస్తున్నారు. అలాగే ఈ ఏడాది చివరి నాటికి అటానమస మెట్రో రైలును కూడా పరీక్షించాలని ఆలోచిస్తున్నారు.

నేపాల్ తాత్కాలిక ప్రధానిగా సుశీలా కర్కి !

(మొదటి పేజీ తరువాయి)

అధ్యక్షుడు రామ్‌చంద్ర ఫౌడెల్ తో భేటీ అయ్యే అవకాశం ఉందని సమాచారం. ఈ సమావేశంలోనే తాత్కాలిక ప్రధాని గురించి తమ ప్రతిపాదనను వారి ముందుంచుతారని భావిస్తున్నారు. వారి నుండి సానుకూల స్పందన వ్యక్తమైతే సుశీలా కర్కి ప్రమాణ స్వీకారమే తరువాయి! ప్రస్తుత పరిస్థితుల్లో అధికార పగ్గాలు ఎవరు చేపట్టాలన్నా వారిద్దరి ఆమోదం తప్పనిసరి అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మరోవైపు సైన్యం నేపాల్ రాజధాని ఖాట్మండువ్యాప్తంగా మొహరించి ఉంది. దేశవ్యాప్తంగా ఆంక్షలు కొనసాగుతున్నాయి..

ఎవరీ సుశీలా కర్కి ?

1952 జూన్ 7న నేపాల్ లోని విరాట్‌నగర్‌లో సుశీలా కర్కి జన్మించారు. ఏడుగురి పిల్లలో పెద్దదైన సుశీల తొలుత ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. ఆ తరువాత న్యాయవ్యవస్థలో అడుగుపెట్టారు. 1979లో తన లీగల్ కెరీర్‌ను ఆమె ప్రారంభించారు. 2007లో సీనియర్ న్యాయవాది అయ్యారు. 2009 జనవరిలో సుప్రీం కోర్టు తాత్కాలిక న్యాయమూర్తిగా నియమితులైన ఆమె 2010లో శాశ్వత న్యాయమూర్తిగా మారారు. 2016లో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత రాజ్యాంగ మండలి సిఫార్సు మేరకు చీఫ్ జస్టిస్‌గా పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టి, నేపాల్ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డు సృష్టించారు. తీవ్రమైన అవినీతి, అనైతికతల్లో కూరుకుపోయిన పాలక వర్గం పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్న యువత దానికి భిన్నంగా కెరీర్ మొత్తం అవినీతికి దూరంగా ఉన్న సుశీల కర్కి వైపు మొగ్గుచూపింది. ఆమె భర్త దుర్గాప్రసాద్ సుబేది నేపాలీ కాంగ్రెస్‌లో యువజన విభాగ నేతగా కొంతకాలం వ్యవహరించారు. అయితే, సుశీలకు మాత్రం రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేదని చెబుతన్నారు.

నేపాల్‌లో చిక్కుకున్న 217 మంది తెలుగు ప్రజలు

నేపాల్‌లోని 12 ప్రాంతాల్లో 217 మంది ఆంధ్రులు చిక్కుకున్నారని విద్య, ఐటి, ఆర్‌టిజి శాఖల మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ప్రత్యేక విమానం ద్వారా వారి ఇళ్లకు చేర్చే బాధ్యత తమ ప్రభుత్వానిదే అని చెప్పారు. వారిని రాష్ట్రానికి రప్పించే అంశంపై సచివాలయంలో ఆర్‌టిజిఎస్ కమాండ్ కంట్రోల్ ద్వారా బుధవారం నిరంతరం సమీక్షలు నిర్వహించారు. అనంతరం హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నేపాల్‌లో చిక్కుకున్న వారిని తీసుకొచ్చేందుకు ఖాట్మండు నుంచి గురువారం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక విమానం ఏర్పాటు చేసిందని లోకేష్ తెలిపారు. ప్రతి తెలుగువారిని వారి ఇళ్లకు చేరుస్తామన్నారు. అక్కడ చిక్కుకున్న వారు తొలుత కొంత ఆందోళనతో ఉన్నారని, తాము మాట్లాడిన తర్వాత కుదురుకున్నారని చెప్పారు. అక్కడ నెలకొన్న భయానక పరిస్థితులను వారంతా వివరించారని వెల్లడించారు. సమస్యలుంటే తమను సంప్రదించాలని చెప్పామన్నారు. వారికి అందుతున్న ఆహారం, నీరు, విద్యుత్ సదుపాయాలపై రియల్ టైంలో ఆరా తీశామని వెల్లడించారు.

ఢిల్లీలో ఉన్న కంట్రోల్ సెంటర్ ద్వారా ఎంపి సానా సతీష్, ఎపి భవన్ అధికారి అర్జే శ్రీకాంత్ రియల్‌టైంలో మానిటరింగ్ చేశారని తెలిపారు. ఎప్పటికప్పుడు పరిస్థితిని ముఖ్యమంత్రికి వివరించామని చెప్పారు. కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడుతో కూడా సంప్రదింపులు జరిపామని తెలిపారు. అక్కడ చిక్కుకున్న వారిలో విశాఖ నుంచి 42 మంది, విజయనగరం నుంచి 34, కర్నూలు నుంచి 22, ఇతర జిల్లాల నుంచి మిగిలిన వారు ఉన్నారని వివరించారు.

తక్షణమే ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరగాలి

- నేపాల్ సంక్షోభంపై సిపిఎం విచారం

న్యూఢిల్లీ : పొరుగుదేశమైన నేపాల్‌లో జడ్ జనరేషన్ యువత చేపట్టిన ఆందోళనలు, నిరసనల్లో 30మంది మరణించడం పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. తమ సమస్యలను పరిష్కరించడంలో, తమ ఆకాంక్షలను నెరవేర్చడంలో వరుసగా ప్రభుత్వాలు విఫలమవుతున్న నేపథ్యంలో ప్రజల్లో ముఖ్యంగా యువతలో పెరుగుతున్న నిరాశా నిస్పృహల నుండి పెల్లుబికిన ఆగ్రహావేశాలను ఈ నిరసనలు ప్రతిబింబిస్తున్నాయని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన విడుదల చేసింది.

పాలక వర్గాల్లో విశృంఖలమైన అవినీతి, పెచ్చరిల్లుతున్న నిరుద్యోగం, యువతకు కొరవడుతున్న ఉపాధి అవకాశాలు ప్రధానంగా జెన్ జెడ్ నిరసనలకు కారణాలుగా వున్నాయి. సామాజిక మాధ్యమాలపై నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించడంతో ఒక్కసారిగా ఈ నిరసనలు తలెత్తాయి. కె.పి.ఓలి ప్రభుత్వం రాజీనామా చేయడంతో శాంతి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు తీవ్రంగా కొనసాగించాలి. ప్రముఖ రాజకీయ నేతలపై మూక హింస పెచ్చురిల్లిన తరుణంలో ఈ చర్యలు మరింత అవసరం. ముఖ్యంగా మాజీ ప్రధాని జలనాథ్ ఖనాల్ భార్య రాజ్యలక్ష్మి చిత్రార్కర్‌ను హతమార్చడమన్నది ఖండించదగిన చర్య అని పొలిట్‌బ్యూరో ప్రకటన పేర్కొంది.

నేపాల్ యువతకు గల ఆందోళనలు, వారి ఫిర్యాదులను తక్షణమే వినాల్సిన అవసరం ఎంతైనా వుంది. వాటిని పరిష్కరించేందుకు వెంటనే సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో, నేపాల్ రాజరికానికి వ్యతిరేకంగా సుదీర్ఘకాలం, ఎంతో కఠినంగా సాగిన పోరాటాలనంతరం సాధించుకున్న రాజ్యాంగంలో పొందుపరచబడిన ప్రజాస్వామ్య, లౌకికవాద విలువలను పరిరక్షించుకోవడానికి జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రస్తుతం దేశంలో నెలకొన్న ఈ పరిస్థితులను రాచరికవాదులు, ఇతర ప్రతీఘాత శక్తులు అవకాశంగా తీసుకుని దుర్వినియోగం చేయకుండా దేశంలోని యువత, ప్రజాస్వామ్య శక్తులు అప్రమత్తంగా వుండాలని పొలిట్‌బ్యూరో పేర్కొంది. ఈ సామూహిక నిరసనలు, ఆందోళనల ఫలితం ప్రజాస్వామ్య పునరుద్ధరణగా వుండాలి తప్పితే ఫ్యూడల్ నిరంకుశవాద పాలనను పునరుద్ధరించరాదని సిపిఎం స్పష్టం చేసింది.



గౌహతిలో భూపేన్ హజారికా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఎ బేబీ

సాంస్కృతిక యోధ భూపేన్‌కు ఎంఎ బేబీ నివాళి

గౌహతి : దేశ సాంస్కృతిక రంగంలో లెజెండ్‌గా మన్ననలు పొందిన ప్రఖ్యాత సంగీత దిగ్గజం, గాయకుడు, రచయిత డాక్టర్ భూపేన్ హజారికా శత జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి సిపిఎం ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ ఘన నివాళులర్పించారు. ప్రజల ప్రియతమ నేత, సిపిఎం పూర్వ కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభలో పాల్గొనేందుకు బుధవారం నాడు గౌహతికి విచ్చేసిన ఆయన..ఆ కార్యాక్రమానికి ముందు నగరంలోని భూపేన్ విగ్రహాన్ని సందర్శించారు. భూపేన్ విగ్రహం వద్ద పూలమాల ఉంచి అంజలి ఘటించారు. దేశ సాంస్కృతిక రంగానికి భూపేన్ చేసిన సేవలను బేబీ కొనియాడారు.

మోడీ అమిత్‌షాలకు ఆ ఉద్దేశ్యం లేదు : ఖర్గే

జునాగఢ్ : ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత రాజ్యాంగాన్ని గానీ, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశం మోడీ, అమిత్‌షాలకు లేదని ఖర్గే విమర్శించారు. బుధవారం ఖర్గే గుజరాత్‌లోని జునాగఢ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'ప్రతిపక్షాల ప్రధాన లక్ష్యం ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడడటమే. ప్రజాస్వామ్యంలో (ఎన్నికలలో) పోరాడటం సర్వసాధారణమే. కానీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే మా లక్ష్యం. మహాత్మాగాంధీ, సర్దార్‌వల్లభాయ్‌పటేల్ వంటి గొప్ప వ్యక్తులు జన్మించిన భూమి ఇది. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిపెట్టిన ఈ ఇద్దరు మనకు అత్యంత గౌరవనీయులు. వారివల్లే దేశం ఐక్యం ఉంది. కానీ మరో ఇద్దరు వ్యక్తులు (మోడీ, అమిత్‌షా) మాత్రం రాజ్యాంగం సురక్షితంగా ఉండాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కానీ కోరుకోవడం లేదు' అని ఆయన అన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా ?

(మొదటి పేజీ తరువాయి)

పెన్షన్ ఇస్తామన్నారని, అదీ ఇవ్వలేదని విమర్శించారు. పైగా ఐదు లక్షల పెన్షన్లు కోత విధించారని వివరించారు. రాష్ట్రంలో ఎక్కడికైనా వెళ్లొచ్చని ఉచిత బస్సు పెట్టి పరిమిత బస్సుల్లోనే అనుమతి ఇవ్వడం అన్యాయమని తెలిపారు. ఉచిత సిలిండర్లన్నీ ఈ ఏడాది ఒక్కటి కూడా ఇవ్వలేదన్నారు. పిఎం కిసాన్ కాకుండా అన్నదాత సుఖీభవ ఇస్తామని ఏడాదికి రూ.6 వేలు మాత్రమే ఇచ్చారని తెలిపారు. తల్లికి వందనంలో రూ.2 వేల కోత పెట్టారన్నారు. గత ప్రభుత్వంలో అమలయిన పథకాలు రద్దు చేయబోమని చెప్పి అన్నిటినీ రద్దు చేశారని వివరించారు. ప్రతిపక్ష హోదా ఇస్తేనే అసెంబ్లీకి హాజరవుతామని మరోసారి స్పష్టం చేశారు. ఈ అంశంపై హైకోర్టులో కేసు ఉందని తెలిపారు. విలేకరుల సమావేశంలో సజ్జల రామకృష్ణారెడ్డి, జూపూడి ప్రభాకరరెడ్డి, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, విడదల రజని, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా లక్ష టన్నుల కోత

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని ప్రాంతాలకు మొత్తానికే అందకపోవడంతో రైతులకు అదనుకు యూరియా దొరకని ఆందోళనకర పరిస్థితి ఏర్పడింది. ఈ పర్యవసానం యూరియా కొరతకు దారి తీసింది. రైతులను అష్టకష్టాలు పాల్జేస్తోంది.

కొరవడిన ముందస్తు విజిలెన్స్

నిరుటి కంటే ఈ సంవత్సరం ఆగస్టు వరకు చూసుకుంటే 25 శాతం మేర యూరియాకు కోత పెట్టింది. దీనికితోడు ఈ ఖరీఫ్‌లో ఎదురైన కొన్ని పరిస్థితులు డిమాండ్ పెరగడానికి, తద్వారా కొరత ఇంకా పెరగడానికి కారణమైందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో సీజన్ నెలన్నర ముందుకు రావడం, పంటల సరళిలో మార్పులు, సాధారణంగా ప్రతి ఏటా పెరుగుతున్న యూరియా వినియోగం... వీటిని కూడా కలిపితే కేంద్రం విధించిన 25 శాతం కోతకు, మరో పది శాతం మేర కొరత ఉంటుందని విశ్లేషిస్తున్నారు. ఈ క్షేత్ర స్థాయి అంశాలను ప్రభుత్వం, వ్యవసాయశాఖ మరుగున పడేసి కేవలం ఓపెనింగ్ బ్యాలెన్స్, డిబిటి గణాంకాలు, కేంద్రం కేటాయింపులు, మొత్తంగా వచ్చిన యూరియా లెక్కలతో రైతులను తప్పుదారి పట్టిస్తోందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతేడాది సెప్టెంబర్‌లో కేంద్రం నుంచి 1.36 లక్షల టన్నుల యూరియా వచ్చింది. ఈసారి 1.55 లక్షల టన్నులు కావాలని అంచనా వేశారు. సెప్టెంబర్ 9 నాటికి ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారమే 22 జిల్లాల్లో యూరియా కొరత నెలకొంది. ఇప్పుడు ఇంత వచ్చింది అంత వస్తుందని ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది.

గ్రామీణ ప్రజలతో సమైక్య ఉద్యమాలు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. బి.వెంకట్ మాట్లాడుతూ రాష్ట్రంలో అదాని స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు వెనుక ఎలక్ట్రిసిటీని ప్రైవేటుపరం చేసే కుట్ర దాగుందన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అనుమతించిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ చెడ్డ వ్యక్తి అయితే, అదే పాలసీని అమలు చేస్తోన్న చంద్రబాబూ... మీరు మంచివారా? అని ప్రశ్నించారు. చంద్రబాబు జూదం, చదరంగాలను కలగలిపి ఆడుతున్నారన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ అజెండా అమలులో భాగంగా వివక్షాపూరిత విధానాలకు బిజెపి పూనుకుంటోందన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ కోసం 80 కోట్ల మంది ఎందుకు ఎదురు చూడాల్సి వస్తోందో చెప్పాలన్నారు. రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం విశాఖ, విజయవాడ, కుప్పం ప్రాంతాల్లో ఎకరాను 99 పైసల చొప్పునే ఎలా కట్టబెట్టిందో చెప్పాలని ప్రశ్నించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడం దుర్మార్గమన్నారు. తెలుగు రాష్ట్రాలకు బిజెపి తీవ్ర అన్యాయం చేస్తోందని తెలిపారు. విభజన హామీల్లో కేటాయించిన ఒక్క జాతీయ ప్రాజెక్టు అయినా ఇవ్వలేదన్నారు. కాగా అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం పేరును మార్చనున్నట్టు ఆయన తెలిపారు. రాబోయే మహాసభలో కొత్త పేరును ఖరారు చేసి ప్రకటిస్తామని చెప్పారు.



జీవన సౌరభం

ఉత్తమమైన వ్యక్తిని రూపొందించడమే విద్య పరమార్థం. అది గొప్ప ఉపాధ్యాయుల చేతిలో ఉంది.

మీ కోసం

స్టీలు డబ్బాలు, కప్‌బోర్డులపై పడిన జిడ్డు మరకలు పోవాలంటే ఒక కర్చీఫ్‌లో కొంచెం బియ్యం, అందులో టూత్ పౌడర్ వేసి మూటలా కట్టుకోవాలి. ఈ మూటతో వాటిపై రుద్దాలి. తరువాత మెత్తని వస్త్రంతో మరోసారి రుద్దితే మరకలు పోతాయి.



JEEVANA జీవన the family

గర్వం

పర్వతంతో స్నేహం చేద్దామని
పలకరించాను
ఆ అన లేదు ఊ అన లేదు!

నేస్తమా అని చేయి అందించి
ముందుకు వంగాను
ఉలుకూ లేదు పలుకూ లేదు!

రెండు చేతులు చాచి కౌగిలికై
ముందడుగు వేసాను!
మాటా లేదు మంతీ లేదు!

నీ కెందుకంత గర్వమని
నిలదీసి అడిగాను!
నా ముందు నువ్వెంత
హా...హా...హా... అని నవ్వింది!

చటుక్కున ఉపాయం తట్టి
చిన్న అద్దంలో బంధించా!



పాపం పర్వతం నా ముందు
చిన్నబోయింది!


గర్వం అణిగి తల దించుకొని
లెంపలేసుకుంది!

ఎక్కువ తక్కువలకు స్నేహంలో
చోటు లేదని చాటింది!!

- తిప్పాన హరి రెడ్డి,
94938 32412.

జత చేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని జంతువులు, వాటికి ఎదురుగా అవి తినే ఆహార పదార్థాలు ఇచ్చాం. క్లూ ఆధారంగా ఏ జంతువు ఏం తింటుందో జత చేయండి చూద్దాం.



నేను గీసిన బొమ్మ





ఎస్‌డి. జాన్‌బీ,
9వ తరగతి,
అరవింద హైస్కూలు,
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఎంత దూరం పెడితే అంత మంచిది..

సతీష్ ఉదయం లేవడంతోనే ఫోను పట్టుకుంటాడు. కాఫీ తాగుతూ, టిఫిన్ చేస్తూ ఫోనులోనే తల పెడతాడు. భార్యతో పెద్దగా మాట్లాడడు. ఆఫీసుకి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన తరువాత కూడా 'రిలీఫ్ కోసం' అంటూ మళ్లీ ఫోన్‌కి అతుక్కుపోతాడు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లో వచ్చిన మెసేజ్‌లు, పోస్టులు చూస్తూ గంటలు గంటలు గడిపేస్తాడు. తల్లిదండ్రులకు అవసరమైన మందులు తెచ్చి ఇస్తాడు. కానీ వారి దగ్గర కూర్చొని మాట్లాడిందే లేదు. ఇంట్లో ఉన్న భార్య, పిల్లలతో మాట్లాడటం కూడా బాగా తగ్గించాడు. రాను రాను ఇంట్లో పరిస్థితి దారుణంగా తయారైంది. భర్త ప్రవర్తన పట్ల భార్య ఎంతో విసిగిపోయింది. ఇల్లు, పిల్లల బాధ్యతతో తన ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం మానేసింది.

ఇటువంటి సందర్భాలు ప్రతి ఇంట్లోనూ కనిపిస్తున్నాయని మానసిక నిపుణులు అంటున్నారు. బంధాలు బీటలు వారే స్థాయికి స్మార్ట్‌ఫోన్లు వచ్చేశాయని హెచ్చరిస్తున్నారు. పిల్లలు, తల్లిదండ్రుల మధ్య సరైన అవగాహన ఉండడం లేదు. పెద్దల పట్ల గౌరవం, నమ్మకం పిల్లల్లో



క్రమంగా తగ్గుతుందని వారు చెబుతున్నారు.

ప్రతి ఇంట్లో చిన్నా, పెద్దా.. ఫోనుని ఎంత దూరం పెడితే అంత మంచిదని సూచిస్తున్నారు. ఇంట్లో ఉన్న కాసేపైనా పిల్లలు తల్లిదండ్రులతో మాట్లాడాలి. భార్య పనుల్లో భర్త చేతనైంత సాయం చేయాలి. పిల్లల చదువు విషయంలో అమ్మానాన్న బాధ్యత తీసుకోవాలి. పుస్తకాల చదువుతో పాటు సమాజాన్ని అర్థం చేసుకునే మంచి కథలు, విజ్ఞానాన్ని పెంచే విషయాలు చెబుతుండాలి. అప్పుడప్పుడు కుటుంబసభ్యులందరూ కలిసి బయటకు వెళుతుండాలి. అప్పుడే బంధాలు ఆరోగ్యంగా ఉంటాయి.

ఇంట్లోనే కాదు పనిప్రదేశంలో కూడా ఫోన్ పదే పదే చూసుకునే అలవాటు కొంతమందికి ఉంటుంది. మీటింగ్‌లో ఉన్నా అరగంటకోసారి ఫోన్ చూసుకుంటూ ఉంటారు. దీని వల్ల పనిలో నాణ్యత కోల్పోతారు. పని పట్ల శ్రద్ధ తగ్గుతుంది. పై అధికారులు లేదా, తోటి సహోద్యోగులతో ముఖ్యమైన విషయాలు చర్చ జరుపుతున్నప్పుడు ఫోన్ చూస్తూ ఉంటే మీపై వ్యతిరేక అభిప్రాయం కలుగుతుంది.

ఈ మధ్య కాలంలో ప్రతి ఒక్కరూ మానసిక ఆందోళనకు లోనవుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. ఇందుకు కుటుంబ, ఆర్థిక సమస్యలు ఒక కారణమైతే, ఫోన్ వాడకం పెరగడం వల్ల కూడా అని వైద్యులు తేల్చి చెబుతున్నారు. ఫోన్ నిత్య జీవితంలో ఓ భాగమైపోయింది. అవసరానికి కన్నా ఎక్కువ వాడేవాళ్లే ఎక్కడ చూసినా కనిపిస్తున్నారు. ఫోను వాడకం వల్ల విపరీతాలు ఎక్కువ కాకుండా ఉండాలి అంటే, ఎంత సమయం కేటాయించాలో అంతవరకే కేటాయించాలి.

డైపర్లు వేసేటప్పుడు ...

ఎప్పుడైనా చిన్నారులతో పాటు ప్రయాణాలు పెట్టుకుంటే బ్యాగులో డైపర్లు కచ్చితంగా ఉండాల్సిందే. అయితే ఇవి పిల్లలకు ఎంతవరకు మేలు చేస్తాయి? వీటిని సరిగ్గా వినియోగించుకోకపోతే చిన్నారులకు కలిగే నష్టం ఏంటి? వంటి విషయాలపై తల్లిదండ్రులకు అవగాహన ఉండాలి.

సాధారణంగా 18 నుంచి 20 నెలల వయసు వచ్చే వరకు పిల్లలకు డైపర్లు వాడొచ్చని వైద్యులు సూచిస్తున్నారు. గరిష్ఠంగా 2 ఏళ్ల వరకు వినియోగించవచ్చని కూడా చెబుతున్నారు. అయితే గంటల కొద్దీ మార్చకుండా అలా ఉంచేస్తే చిన్నారులకు ఇబ్బందులు తప్పవని హెచ్చరిస్తున్నారు. ఇంకా అనేక జాగ్రత్తలు చెబుతున్నారు.




- వాడినవే మళ్లీ మళ్లీ వాడినా శరీరం ఒరుసుకుపోతుంది. దురదలు, దద్దుర్లు వస్తాయి. వీటిని మార్చకుండా అలానే వదిలేస్తే మూత్రం అక్కడ నిల్వ ఉండి గజ్జలకు పుళ్లు పడే ప్రమాదం ఉంటుంది.
- కాటన్ డైపర్లు వినియోగించడం కాస్త ఉత్తమం. డిస్పోజబుల్ డైపర్లు ప్రయాణాల సమయంలో వాడవచ్చు. అయితే ఏ రకమైన డ్రైపర్ అయినా మూడు గంటలకోసారి మార్చాల్సి ఉంటుంది.
- చాలామంది డైపర్ విప్పిన వెంటనే వేసేస్తుంటారు. అయితే కాసేపు విరామం ఇవ్వాలి. దాని వల్ల అవయవాలకు గాలి తగులుతుంది. మార్చినప్పుడల్లా వేడినీళ్లతో కడిగేసి సున్నితంగా కాటన్ బట్టతో అద్దాలి.
- దద్దుర్లు రాకుండా సంబంధిత క్రీమ్‌రాయాలి. మరీ లూజ్‌గా, మరీ బిగుతుగా ఉండకూడదు.
- డయేరియాతో బాధపడే చిన్నారుల్లో మూత్రం పరిమాణం, రంగును బట్టి డయేరియా తీవ్రత అంచనా వేయాల్సి ఉంటుంది. అయితే డైపర్ల వినియోగం కారణంగా అది గుర్తించడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. చికిత్సలో సమస్యలు వస్తాయి. డీహైడ్రేషన్ ఎంత వరకు ఉందో గుర్తించడం సమస్య అవుతుంది. కాబట్టి డయేరియాతో బాధపడే చిన్నారులకు డైపర్లు వేసేటప్పుడు జాగ్రత్తలు వహించాలి.
- అలాగే పిల్లలకు 2 ఏళ్లు వచ్చిన తర్వాత డైపర్లు వేయడం ఆపేయాలి. లేకపోతే వారికి సమయానికి మూత్రం వచ్చే అలవాటు పోతుంది.

అరటితో ఆరోగ్యం

అన్ని కాలాల్లో దొరికే అరటి పండు ఆరోగ్యానికే కాదు అందానికీ ఎంతో మేలు చేస్తుంది.

- అరటి పండ్లలో పొటాషియం ఎక్కువ మోతాదులో ఉంటుంది. ఇది ఎముకలు, దంతాలకు మంచిది. రక్త నాళాలను క్రమబద్ధీకరించడంలో సహాయపడుతుంది. వారానికి 2-3 అరటి పండ్లు తినే మహిళలు కిడ్నీ జబ్బుల బారిన పడే ముప్పు తక్కువని ఓ అధ్యయనంలో తేలింది.
- యాంటీ ఆక్సిడెంట్స్ వల్ల అంతర్గత, ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే కణాల నష్టాన్ని తగ్గించడానికి అరటి పండు ఉపయోగపడుతుంది.
- ఇందులో ఆరోగ్యకరమైన చక్కెరలతో పాటు సహజ సిద్ధమైన ఫైబర్‌లు ఉన్నాయి. పెక్టిన్ అనే పదార్థం ఆహారాన్ని జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. దాంతో మలబద్ధక సమస్య తగ్గుతుంది. అందుకే ప్రతి రోజూ ఒక పండును తినాలి.
- పండులో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. రక్తహీనత సమస్యతో బాధపడేవారు దీన్ని తరుచూ తింటే మంచిది. రక్త నాళాల్లో గ్లూకోజు స్థాయిల మీద సానుకూల ప్రభావాన్ని చూపించే బి6 విటమిన్ అరటి పండ్లలో లభిస్తుంది. దీనిలో ఉండే బి విటమిన్లు కడుపునొప్పి, ఛాతీనొప్పి, మానసిక సమస్యలను నియంత్రించడంలో దోహదపడతాయి.
- అరటి పండులో కేలరీలు అధికంగా ఉంటాయి. మూడు ఆపిల్స్ తింటే ఎన్ని కేలరీలు లభిస్తాయో ఒక అరటి పండు తిన్నా అన్నే వస్తాయి.
- అయితే మధుమేహం ఉన్నవారు వైద్యుల సలహా మేరకు తీసుకోవడం మంచిది.
- అరటి పండును పేస్ట్ చేసి ఫేస్‌ప్యాక్ చేసుకుంటే ముఖం నునుపుగా, మృదువుగా మారుతుంది.
- అరటి తొక్కను ముక్కలుగా కట్ చేసి మొక్కలకు వేస్తే ఆరోగ్యంగా పెరుగుతాయి.



కుల్దీప్, దూబే మాయ

యుఎఇపై భారత్ ఘన విజయం
ఆసియాకప్ క్రికెట్ టోర్నీ

దుబాయ్: టీమిండియా స్పిన్నర్ కుల్దీప్ మాయాజాలానికి తోడు శివమ్ దూబే ఆల్‌రౌండ్ ప్రతిభ, హైదరాబాద్ బ్యాటర్ అభిషేక్ శర్మ ధనా ధన్ బ్యాటింగ్.. వెరసి ఆతిథ్య యునైటెడ్ అరబ్ ఎమిరేట్(యుఎఇ)పై భారత్ ఘన విజయం సాధించింది. తొలుత టీమిండియా స్పిన్నర్లు సమిష్టిగా చెలరేగడంతో యుఎఇ జట్టును కేవలం 57పరుగులకే ఆలౌట్ చేసి.. ఆ లక్ష్యాన్ని భారతజట్టు 4.3 ఓవర్లలో కేవలం ఒక వికెట్ కోల్పోయి సునాయాసంగా ఛేదించి బోణీ కొట్టింది. ఆసియాకప్ టోర్నీలో భాగంగా బుధవారం జరిగిన గ్రూప్-ఎ తొలి లీగ్ మ్యాచ్‌లో ఆతిథ్య యుఎఇ జట్టుపై భారతజట్టు 9వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత యుఎఇని 13.1 ఓవర్లలో 57పరుగులకే ఆలౌట్ చేయడంతో న్యూజిలాండ్ చేతిలో 2003లో 66పరుగులకు ఆలౌటైన చెత్త రికార్డును యుఎఇ టీమిండియాపై నెలకొల్పింది. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు శుభారంభం లభించింది. ఓపెనర్లు అలీషాన్(22), కెప్టెన్ వాసీమ్(19) కలిసి తొలి వికెట్‌కు 26పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. వీరిద్దరూ ఔటయ్యాక యుఎఇ జట్టు బ్యాటర్లు ఇలా వచ్చి అలా వెళ్లారు. ఆ తర్వాత వచ్చిన 8మంది బ్యాటర్లు కనీసం మూడంటే మూడు పరుగుల స్కోర్‌ను కూడా కొట్టలేకపోయారు. తొలి వికెట్ 26పరుగుల వద్ద కోల్పోయిన యుఎఇ జట్టు మో 31పరుగులకు మిగిలిన 9వికెట్లను కోల్పోవడం విశేషం. మరోవైపు టీమిండియా మిస్టరీ స్పిన్నర్లు కుల్దీప్(4/7), దూబే(3/4), వరుణ్ చక్రవర్తి(1/4) యుఎఇ బ్యాటర్లను పెవీలియన్‌కు పంపడంలో సఫలీకృతులయ్యారు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆతిథ్య జట్టుపై ఎలాంటి ప్రయోగాలకు తావులేకుండా బలీయ జట్టుతోనే భారత్ బరిలోకి దిగింది. హార్దిక్, దూబే, అక్షర్ ఆల్‌రౌండర్లకు తోడు పేసర్ల కోటాలో బుమ్రా, స్పిన్నర్ల కోటాలో వరుణ్, కుల్దీప్‌లతో భారతజట్టు బరిలోకి దిగింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ కుల్దీప్ యాదవ్‌కు లభించింది. నేడు బంగ్లాదేశ్-హాంకాంగ్ జట్ల మధ్య మ్యాచ్ జరగనుంది.



స్కోర్‌బోర్డు...

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఇన్నింగ్స్: ఆలీషాన్ (బి)బుమ్రా 22), వాసీం (ఎల్‌బి)కుల్దీప్ 19, ముహమ్మద్ (సి)కుల్దీప్ (బి)వరుణ్ చక్రవర్తి 2, రాహుల్ చోప్రా (సి)శుభ్‌మన్ (బి)కుల్దీప్ 3, ఆసిఫ్ ఖాన్ (సి)సంజు (బి)దూబే 2, హర్షిత్ (బి)కుల్దీప్ 2, ధృవ్ పరషార్ (ఎల్‌బి)దూబే 1, సిమ్రన్‌జీత్ (ఎల్‌బి)అక్షర్ 1, హైదర్ అలీ (సి)సంజు (బి)కుల్దీప్ 1, జునైద్ (సి)సూర్యకుమార్ (బి)దూబే 0, రోహిద్ ఖాన్ (నాటౌట్) 2, అదనం 2. (13.1ఓవర్లలో ఆలౌట్) 57పరుగులు. **వికెట్ల పతనం:** 1/26, 2/29, 3/47, 4/48, 5/50, 6/51, 7/52, 8/54, 9/55, 10/57 **బౌలింగ్:** హార్దిక్ 1-0-10-0, బుమ్రా 3-0-19-1, అక్షర్ 3-0-13-1, వరణ్ చక్రవర్తి 2-0-4-1, కుల్దీప్ 2.1-0-7-4, దూబే 2-0-4-3.

ఇండియా ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (సి)హైదర్ అలీ (బి)జునైద్ సిద్ధిక్ 30, శుభ్‌మన్ (నాటౌట్) 20, సూర్యకుమార్ యాదవ్ (నాటౌట్) 7, అదనం 3. (4.3ఓవర్లలో వికెట్ నష్టపోయి) 60 పరుగులు. **వికెట్ల పతనం:** 1/48 **బౌలింగ్:** హైదర్ 1-0-10-0, రోహిద్ 1-0-15-0, ధృవ్ పరషార్ 1-0-13-0, జునైద్ 1-0-16-1, సిమ్రన్‌జీత్ 0.3-0-6-0.



మహిళల హాకీలో కొరియాపై భారత్ గెలుపు

ఆసియాకప్ మహిళల హాకీ

హాంగ్జౌ: ఆసియాకప్ మహిళల హాకీ సూపర్-4లోనూ భారతజట్టు అదే జోరును కనబర్చింది. గ్రూప్-బిలో వరుసగా మూడు విజయాలతో సూపర్-4కు చేరిన భారత మహిళలజట్టు బుధవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కొరియాపై 4-2గోల్స్ తేడాతో విజయం సాధించింది. పాల్కే, సంగీత, లాల్‌రెమిసిమి, రుతుజ గోల్స్ కొట్టారు. మ్యాచ్ ప్రారంభమైన 2వ ని.లోనే పాల్కే గోల్ చేయ డంతో భారత్ 1-0 ఆధిక్యతలోకి నిలిచింది. కానీ రెండో అర్ధభాగం లో ఏ జట్టూ గోల్ చేయలేదు. సంగీత(32వ ని.లో), లాల్‌రిమిసిమి (40వ ని.లో) ఒక్కో గోల్ కొట్టారు. మరోవైపు కొరియా తరఫున కిమ్ యు(33వ ని.లో) ఒక గోల్ చేయడంతో భారత్ 3-1గోల్స్ ఆధిక్య తలో నిలిచింది. నిర్ణయాత్మక నాల్గో, చివరి క్వార్టర్‌లో కిమ్ యు (53వ ని.లో) మరో గోల్ చేయడంలో భారత్ ఆధిక్యత 3-2గోల్స్ ఆధిక్యతకు తగ్గింది. మ్యాచ్ ముగియడానికి ఒక్క నిమిషం ముందు రుతుజ గోల్ చేయడంలో భారత్ విజయ ఢంకా మోగించింది.

టైటాన్స్ హ్యాట్రిక్

ముంబపై గెలుపుతో పై పైకి..

విశాఖపట్నం: ప్రొ కబడ్డీ సీజన్-12లో తెలుగు టైటాన్స్ వరుసగా మూడో విజయాన్ని నమోదు చేసుకొని హ్యాట్రిక్ విజయాలతో దూసుకెళ్తోంది. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ ... పాయింట్ల తేడాతో యు ముంబను చిత్తుచేసింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి తెలుగు టైటాన్స్ 27-11 పాయింట్ల ఆధిక్యతలో నిలిచిన టైటాన్స్.. రెండో అర్ధభాగంలోనూ ధాటిగానే ఆడింది. రెండో అర్ధభాగంలో యు ముంబ పుంజుకొనేందుకు ప్రయత్నించినా.. నిర్ణీత సమయం ముగిసేసరికి టైటాన్స్ జట్టు 45-37పాయింట్ల తేడాతో విజయం సాధించింది. దీంతో టైటాన్స్ వరుసగా మూడో గెలుపుతో 3వ స్థానానికి ఎగబాకింది. టైటాన్స్ ఆల్‌రౌండర్ భరత్(13), చేతన్(6)కి తోడు కెప్టెన్ విజయ్ మాలిక్(5) రైడ్‌లలో రాణించారు. మరో మ్యాచ్‌లో పుణేరి పల్టన్స్ 43-32పాయింట్ల తేడాతో యుపి యోధాస్‌ను చిత్తుచేసింది. నేడు యు ముంబ-పట్నా పైరెట్స్, దబాంగ్ ఢిల్లీ-గుజరాత్ జెయింట్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68